www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 93 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com సోమవారం 20 - 07 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కలకలం.. విమానాలపై లేజర్ దాడులు !




## కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం సముద్రంపాలైన ముడిచమురు

- నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం
- పైప్‌లైన్ పగిలి సముద్రంలోకి భారీగా చేరిన ముడి చమురు
- నిర్వహణ లోపాలే కారణమని ప్రాథమిక అంచనా
- ఘటనపై విచారణకు ఆదేశించిన పోర్టు అధికారులు
- పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని ఆందోళన

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో శనివారం భారీ ప్రమాదం చోటుచేసుకుంది. పోర్టులోని రెండో బెర్త్ వద్ద ముడి చమురు రవాణా చేసే పైప్‌లైన్ పగిలిపోవడంతో పెద్ద ఎత్తున క్రూడాయిల్ సముద్రంలోకి లీకైంది. ఈ - మిగతా 2 లో


## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు

- జాతీయ సినీ అవార్డులు ప్రకటించిన కేంద్రం
- విజేతలపై అభినందనల వర్షం
- తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలు గర్వకారణమన్న ముఖ్యమంత్రి
- కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి మూలస్తంభాలని వ్యాఖ్య
- తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్ష



**అమరావతి :**
72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు.తెలుగు సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల అసాధారణ ప్రతిభ మన సినిమాకు గొప్ప గర్వకారణంగా నిలిచిందని చంద్రబాబు కొనియాడారు. "కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలు. తెలుగు సినిమా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తరతరాలకు స్ఫూర్తినివ్వాలి" అని ఆయన తన పోస్టులో ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారందరూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన పోస్ట్‌లో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక - మిగతా 2 లో

## ఏపీలో మళ్లీ కరోనా కలకలం



- నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో కొత్త కేసులు
- క్యాన్సర్ చికిత్స పొందుతున్న బాలుడికి, డయాలసిస్ చేయించుకుంటున్న బాలికకు పాజిటివ్
- వారి కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్
- ఆందోళన వద్దని చెబుతున్న ఆరోగ్య శాఖ అధికారులు

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కేసులు మళ్లీ స్వల్పంగా పెరుగుతున్నాయి. తాజాగా నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు కొత్త కేసులు వెలుగులోకి రావడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో - మిగతా 2 లో



## ఇకపై రామ్, రహీమ్, రాబిన్‌లకు సమాన హక్కులు

- యూసీసీ బిల్లుకు కేబినెట్ ఆమోదం
- యూసీసీ బిల్లుకు మధ్యప్రదేశ్ కేబినెట్ ఆమోదం
- ఇకపై అన్ని మతాల వారికి సమాన హక్కులు లభిస్తాయని మధ్యప్రదేశ్ సీఎం వ్యాఖ్య

**ఢిల్లీ :**
ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)తో ఇకపై రామ్, రహీమ్, రాబిన్‌లకు సమాన హక్కులు లభిస్తాయని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ కేబినెట్ ఆదివారం యూసీసీ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నామని తెలిపారు."ఈ రోజు మధ్యప్రదేశ్ కేబినెట్ ఉమ్మడి - మిగతా 2 లో

## మార్స్‌లో గ్రహాంతరవాసులు కాదు.. మన బ్యాక్టీరియాలే మనకు ముప్పా

- అంగారక గ్రహంపైకి మనుషులను పంపే క్రమంలో కొత్త అధ్యయనం
- వ్యోమగాములతో వెళ్లే సూక్ష్మజీవులే పెద్ద ముప్పని అంచనా
- అంగారకుడిపై తీవ్ర అతినీలలోహిత కిరణాలు, గడ్డకట్టే ఉష్ణోగ్రతలు
- ఆ వాతావరణంలో కొన్ని బ్యాక్టీరియాలు తమ స్వభావాన్ని మార్చుకునే ప్రమాదం
- కొన్ని సూక్ష్మజీవులు మరింత విషపూరితంగా మారే ప్రమాదం

**ఢిల్లీ :**
అంగారక గ్రహంపై మనుషులను పంపేందుకు ప్రపంచ అంతరిక్ష సంస్థలు వేగంగా సిద్ధమవుతున్న వేళ.. శాస్త్రవేత్తల కొత్త అధ్యయనం ఆసక్తికర ప్రశ్నను తెరపైకి తెచ్చింది. మార్స్‌పై ఉండే జీవుల కంటే.. భూమి నుంచి వ్యోమగాములతో వెళ్లే సూక్ష్మజీవులే భవిష్యత్‌లో పెద్ద ముప్పుగా మారే - మిగతా 2 లో







## పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం

- ఇరాన్ దాడిలో ఇద్దరు అమెరికా సైనికుల మృతి!
- జోర్డాన్‌పై ఇరాన్ క్షిపణుల దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మృతి
- యుద్ధం ప్రారంభమయ్యాక ఇప్పటి వరకు 16 మంది మృతి
- అమెరికాకు "మరచిపోలేని పాఠాలు" చెప్తామన్న మొజ్తబా ఖమేనీ


## ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు

- బూతులు, తిట్లు, అసభ్య పదజాలం వాడడం 'అశ్లీలత' కాదు - సుప్రీం కోర్టు
- ఐపీసీ సెక్షన్ 294(బి) పరిధిలోకి అసభ్య పదజాలం రాదు- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- "ఒక మాటను అశ్లీలమైనదిగా పరిగణించాలంటే, అది కామ ప్రకోపాన్ని కలిగించేదిగా, కామవాంఛలను రేకెత్తించేదిగా ఉండాలి



**ఢిల్లీ :**
బూతు మాటలు, దూషణలు, అసభ్య పదజాలం ఉపయోగించినంత మాత్రాన, అవి ఎంత అభ్యంతరకరంగా లేదా సభ్యత లేనివిగా ఉన్నప్పటికీ 'అశ్లీలత' నేరం కిందకు రావని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 294 కింద ట్రయల్ కోర్టు తనకు విధించిన శిక్షను హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, "కేవలం తిట్టడం లేదా అసభ్య - మిగతా 2 లో

## హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం




- ట్రైనీ ఐపీఎస్ పై కేసు
- హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో దారుణ ఘటన
- మహిళా ఐపీఎస్ ట్రైనీపై లైంగిక వేధింపులకు పాల్పడిన సహోద్యోగి
- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- కత్తితో బెదిరించి, అభ్యంతరకర వీడియోలు తీశాడని బాధితురాలి ఫిర్యాదు
- బాధితురాలి భర్తకే ఆ వీడియోలను పంపినట్లు ఆరోపణలు

**హైదరాబాద్ :**
దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రమైన హైదరాబాద్ లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఒక దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. తోటి మహిళా - మిగతా 2 లో




## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్
- క్యూర్ పరిధిలో లక్ష ఎల్‌ఐజీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం
- తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు

**హైదరాబాద్ :**
హైదరాబాద్‌లోని పేదల సొంతింటి కలను నిజం చేయబోతున్నట్లు గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'క్యూర్' పరిధిలో లక్ష ఎల్‌ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు - మిగతా 2 లో

## గాంధీభవన్‌కు రావొద్దు.. నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు!

- ఎస్ఐఆర్‌పై రేవంత్ కఠిన ఆదేశాలు
- ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని నేతలకు సూచన
- గాంధీభవన్‌కు రావొద్దన్న సీఎం
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- ఉత్తమ 100 బీఎల్‌ఏలకు రాహుల్‌తో కలిపిస్తామని హామీ



**హైదరాబాద్ :**
ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పార్టీ నాయకత్వాన్ని అప్రమత్తం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్‌పై నేడు నిర్వహించిన వర్చువల్ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.ఎస్ఐఆర్ బాధ్యతలు అప్పగించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, చివరి బాధ్యత వారిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి - మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్ దూసిన వీసా కత్తి!

మితవాద రాజకీయం ఊరకే ఉండదు. నిరంతరం కొత్త శత్రువుల్ని వెదుక్కుంటుంది. తన చర్యల పర్యవసానంగా పుట్టుకొచ్చే సంక్షోభాలనుంచి జనం దృష్టి మరల్చడానికి నానా తంటాలూ పడుతుంది. ఆ రాజకీయంలోనే పుట్టి, దాన్ని మరింత దిగజార్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండో దఫా వచ్చాక వలసలపై కత్తిగట్టారు. అమెరికాలో చదువుకోవటానికొచ్చినవారు గరిష్ఠంగా నాలుగేళ్లకు మించి ఉండటానికి వీల్లేదంటూ తాజాగా తీసుకురావాలనుకుంటున్న నిబంధన ఆ పరంపరలో భాగమే. ఇతరేతర వీసాల సంగతి సరేసరి. ప్రపంచ దేశాల్లోని వారందరికీ ఉన్నత చదువుల గమ్యస్థానం అమెరికాయే. అక్కడ చదువుకుంటే సాఫ్ట్‌వేర్, ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో మెరుగైన జీతాలతో కొలువులొస్తాయన్న నమ్మకమే అందుకు కారణం. అయితే ట్రంప్ తీసుకున్న కొత్త నిర్ణయంవల్ల విద్యార్థులకు మాత్రమే కాదు... అక్కడి విద్యాలయాలు, టెక్ రంగ సంస్థలకు కూడా సమస్యలొస్తాయి. విద్యాలయాల వేల కోట్ల ఆదాయం పడిపోతే, టెక్‌రంగ సంస్థలకు నిపుణుల కొరత ఏర్పడుతుంది.ఎందుకంటే స్థానికులతో పోలిస్తే విదేశాలనుంచి వచ్చే విద్యార్థులు చదువుల్లో, తెలివితేటల్లో చాలా ముందంజలో ఉంటారు. డిగ్రీ చదువులకొచ్చేవరకూ స్వదేశీయులకు అంతా ఉచితమే అయినా, అటుపై తడిసిమోపెడవుతుంది. వారితో పోలిస్తే నిజానికి విదేశీ విద్యార్థులు రెండు మూడు రెట్లు అధికంగా చెల్లించాలి. ఆ మొత్తంతోనే స్థానికులకు స్కాలర్‌షిప్‌లిస్తారు. వారినుంచి తక్కువ ఫీజు వసూలు చేస్తారు. స్థానికులు హ్యూమనిటీస్, ఆర్ట్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, లా తదితర కోర్సుల్లో ఆసక్తి కనబరుస్తారు. సాంకేతిక రంగంలో దూసుకెళ్లే అమెరికాకు 'స్టెమ్'(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) విభాగంలో నిపుణులు అవసరం. విదేశీయులు కఠినమైన వడపోత తర్వాత ఆ కోర్సులు చదవడానికి వెళ్లినవారు గనుక ఆ కోర్సులను సులభంగా ఆకళింపు చేసుకుంటారు. స్టెమ్ కోర్సుల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ స్థాయిలో 70 శాతం సీట్లు విదేశీయులకే లభించటం ఇందుకే. స్థానికుల్ని వారితో పోటీపడేలా తీర్చిదిద్దటానికి తాము చేయాల్సిందేమిటన్న దృష్టి ట్రంప్‌కుగానీ, ఆయన ముందున్న పాలకులకుగానీ లేదు.తగినంతమంది సాంకేతిక నిపుణులు స్థానికంగా లభ్యంకాకపోవటంవల్లనే అమెరికా దిగ్గజ టెక్ సంస్థలు విదేశాలనుంచి వచ్చేవారిని ఎంపిక చేసుకోవాల్సివస్తున్నది. అలా భర్తీ చేసుకోనట్టయితే ఇన్నోవేషన్ రంగంలో ఆ దేశం వెనకబడిపోతుంది. అదిగాక విదేశీ విద్యార్థులు చెల్లించే వేలాది కోట్ల డాలర్ల ఫీజులు, టెక్ సంస్థల విస్తరణ, లాభార్జనల వల్ల మరిన్ని వేలకోట్ల డాలర్లు పన్నుల రూపంలో ఖజానాకు సమకూరుతాయి. ఇతరత్రా సంస్థల సంగతలావుంచి మన భారత సంస్థలు టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కార్పొరేట్ పన్ను రూపంలోనే నిరుడు 867 కోట్ల డాలర్లు (రూ. 73,000 కోట్లకు పైగా) చెల్లించాయి. మొత్తంగా అన్ని సంస్థలూ 13,008 కోట్ల డాలర్లకు పైగా (రూ. 10,99,166 కోట్ల?లపైగా) చెల్లించాయి. ఇవిగాక జీఎస్‌టీ, కస్టమ్స్ సుంకం, ఉద్యోగులు చెల్లించే టీడీఎస్‌లు అదనం. ఇంతగా లాభపడుతూ బాధిత దేశంగా శోకించటం అమెరికాకే చెల్లింది.వీసా వ్యవస్థ దశాబ్దాలుగా దుర్వినియోగమవుతున్నదనీ, దేశ భద్రత ప్రమాదంలో పడిందనీ గొంతుచించుకుంటున్న అమెరికా తాను ఎడాపెడా వర్ధమాన, వెనకబడిన దేశాలనుంచి దశాబ్దాలుగా కొల్లగొడుతున్న సంపద గురించి మాట్లాడదు. ఇందులో ఆ దేశాల పాలకుల తప్పు కూడా ఉంది. మన దేశం సంగతే తీసుకుంటే 2047 కల్లా 'వికసిత్ భారత్' తీసుకొస్తామంటారు. కానీ అమెరికా మాదిరిగా కనీసం డిగ్రీవరకూ ఉచిత విద్య, నామమాత్రపు ఫీజులతో ఆపై విద్య అందుబాటులోకి తెచ్చే ఆలోచన చేయరు. జీడీపీలో కనీసం 6 శాతం విద్యకు వ్యయం చేయాలన్న లక్ష్యం పాటించరు. హైస్కూల్ విద్యవరకూ శ్రద్ధ పెడుతున్నట్టు కనబడుతూ ఆపై చదువుల్ని కార్పొరేట్లకు వదిలేశారు. వేలాదిమంది ప్రొఫెసర్ల కొరతతో విశ్వవిద్యాలయాలు దయనీయ స్థితిలో పడినా పట్టదు. కొలువుల సంగతి సరేసరి. ఇలాంటి స్థితిలో ట్రంప్ బెదిరిస్తే, పరిమితులు విధిస్తే నిస్సహాయంగా మిగలటం తప్ప మన యువత చేయగలిగేది ఏముంది?



## "ఇకపై రామ్, రహీమ్, రాబిన్‌లకు సమాన హక్కులు"

**మొదటిపేజీ తరువాయి -** పౌర స్మృతి బిల్లు, 2026కు ఏకగ్రీవంగా, హృదయపూర్వకంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా నా కేబినెట్ సహచరులకు, మీ అందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. రాజ్యాంగబద్ధమైన సమానత్వానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ బిల్లు చారిత్రక భారతీయ సంస్కృతికి, విలువలకు కట్టుబడి ఉంది. జులై 20 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో ఈ యూసీసీ బిల్లును ప్రవేశపెడతాం."

### ప్రజల మద్దతుతోనే!

ఉమ్మడి పౌర స్మృతికి ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తోందని, రాష్ట్ర జనాభాలో 93 శాతం కంటే ఎక్కువ మంది ఈ చట్టానికి మద్దతు ఇస్తున్నారని సీఎం మోహన్ యాదవ్ అన్నారు. ముస్లిం సమాజం నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించిన డేటాను ప్రస్తావిస్తూ, ఆ సమాజంలోని మెజారిటీ మహిళలు ఈ యూసీసీ చట్టానికి అనుకూలంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. "మా డేటా ప్రకారం, 80 శాతం మంది ముస్లిం మహిళలు, 40 శాతం ముస్లిం పురుషులు ఒకే విధమైన ఉమ్మడి చట్టం ఉండాలని విశ్వసిస్తున్నారు. మాకు 3 కోట్ల సందేశాలు (రామీ) వచ్చాయి. మేము ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజాభిప్రాయాన్ని సేకరించాం. నేను స్వయంగా వివిధ ర్యాలీలు, సభల ద్వారా ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను కోరాను. ఏప్రిల్ 24న ఒక ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అందరి నుంచి సూచనలను ఆహ్వానించాం. యూసీసీ ఇప్పటికే అమలులో ఉన్న రాష్ట్రాలపై కూడా మేము అధ్యయనం చేశాం. మాకు మొత్తం 9.58 లక్షల సూచనలు వచ్చాయి. రాష్ట్రంలోని 93.54 శాతం మంది ప్రజలు ఈ చట్టానికి మద్దతు ఇచ్చారు" అని సీఎం మోహన్ యాదవ్ అన్నారు.సమాజంలోని వివక్షను తొలగించడానికి, అన్ని వర్గాలను ఒకే చట్టపరమైన ఛత్రం కిందికి తీసుకురావడానికి ఈ యూసీసీ చట్టాన్ని రూపొందించినట్లు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ స్పష్టం చేశారు. "సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు లభించేలా చూస్తామని మేము సంకల్పం తీసుకున్నాం. అది రామ్ అయినా, రహీమ్ అయినా, రవీందర్ అయినా, రాబిన్ అయినా- ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలి" అని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పేర్కొన్నారు.

### కాంగ్రెస్‌పై విమర్శలు

"కమిటీ ముందు బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ, వామపక్ష పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. కానీ ప్రతి అంశాన్ని హిందూ-ముస్లిం, ఓటు బ్యాంకు రాజకీయాల కోణంలో చూసే కాంగ్రెస్ మాత్రం తన అభిప్రాయాలు చెప్పకుండా దూరంగా ఉంది" అని ముఖ్యమంత్రి విమర్శించారు. వివాహం, సహజీవనం, దత్తత, సరోగసీ, ఏఆర్‌టీ ద్వారా జన్మించిన పిల్లలందరికీ ఈ చట్టం సమాన చట్టపరమైన హోదాను కల్పిస్తుందని యాదవ్ పేర్కొన్నారు.

### గిరిజనులకు మినహాయింపు

మధ్యప్రదేశ్‌లో యూసీసీ ముసాయిదాను రూపొందించడానికి ప్రభుత్వం నియమించిన కమిటీకి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వం వహించారు. ఈ కమిటీ ఇటీవల ముఖ్యమంత్రికి తన నివేదికను సమర్పించింది. షెడ్యూల్ తెగలను (ఆదివాసీలను) దీని పరిధి నుంచి మినహాయించాలని ఈ నివేదిక సిఫారసు చేసింది. దీనితో ఈ ఉమ్మడి పౌర స్మృతి ముసాయిదా బిల్లులో గిరిజన వర్గాన్ని మినహాయించారు. ఈ ప్రతిపాదిత బిల్లులో వివాహం, విడాకులు, భరణం, వారసత్వం, సహజీవనం, దత్తత, వారసత్వం వంటి పలు అంశాలను చేర్చారు. ఈ బిల్లు ప్రకారం, ఇకపై వివాహ నమోదు తప్పనిసరి. పురుషులకు వివాహ వయస్సు 21 ఏళ్లు, మహిళలకు 18 ఏళ్లు నిండాలి. మహిళా సాధికారత, సామాజిక సామరస్యం, జాతీయ ఐక్యతను బలోపేతం చేసే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ బిల్లుకు, రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని అన్ని పార్టీలకు సీఎం పిలుపునిచ్చారు.

## మార్స్‌లో గ్రహాంతరవాసులు కాదు.. మన బ్యాక్టీరియాలే మనకు ముప్పా?

**మొదటిపేజీ తరువాయి -**
అవకాశం ఉందని హెచ్చరిస్తోంది. అక్కడి తీవ్ర వాతావరణానికి అలవాటు పడే క్రమంలో కొన్ని బ్యాక్టీరియా మరింత ప్రమాదకరంగా మారవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.మన శరీరంలో సహజంగా ఉండే కొన్ని బ్యాక్టీరియాల గురించే ఈ అధ్యయనం సాగింది. అంగారకుడిపై తీవ్ర అతినీలలోహిత కిరణాలు, గడ్డకట్టే ఉష్ణోగ్రతలు, అత్యల్ప వాయు పీడనం, విషపూరిత పెర్క్లోరేట్ లవణాలు వంటి పరిస్థితులు ఉంటాయి. అలాంటి ఒత్తిడిలో కొన్ని బ్యాక్టీరియాలు తమ స్వభావాన్ని మార్చుకుని మరింత బలంగా మారే అవకాశం ఉందని పరిశోధన సూచిస్తోంది.ఈ అధ్యయనాన్ని స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరో విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త టొమాసో జక్కారియా నిర్వహించారు. సాధారణ పరిస్థితుల్లో మనుషులకు ఇన్‌ఫెక్షన్లు కలిగించే నాలుగు రకాల బ్యాక్టీరియాలను ఎంపిక చేశారు. వాటిపై మార్స్‌ను పోలిన వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి పరీక్షలు నిర్వహించారు. తక్కువ గాలి పీడనం, తీవ్రమైన ఎండ, అధిక అతినీలలోహిత కిరణాలు, పెర్క్లోరేట్ లవణాలతో కూడిన పరిస్థితుల్లో వాటి ప్రవర్తనను పరిశీలించారు.చాలా బ్యాక్టీరియా కొద్ది గంటల్లోనే నశించినా.. కొన్ని మాత్రం ఊహించిన దానికంటే ఎక్కువసేపు మనుగడ సాగించాయని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఎండిపోయిన పరిస్థితుల్లో కొన్ని రెండు వారాలకుపైగా జీవించాయి. ఒకవేళ ఇవి వ్యోమగాముల నివాస కేంద్రాల్లోకి చేరితే అక్కడ ఉండే అనుకూల వాతావరణంలో మరింత వేగంగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.శాస్త్రవేత్తలను ఎక్కువగా ఆందోళనకు గురిచేస్తున్న అంశం బ్యాక్టీరియా మనుగడ కాదు.. వాటిలో వచ్చే మార్పులు. తీవ్ర ఒత్తిడి పరిస్థితుల్లో కొన్ని సూక్ష్మజీవులు మరింత విషపూరితంగా మారడం, యాంటీబయోటిక్ మందులకు తట్టుకునే సామర్థ్యం పెరగడం, రక్షణ పొరలు ఏర్పరచుకోవడం వంటి మార్పులు భూమిపై ఇప్పటికే గుర్తించారు. మార్స్ ప్రయాణాలు నెలలు, సంవత్సరాలు కొనసాగితే ఇలాంటి మార్పులు మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని అధ్యయనం చెబుతోంది.అంతరిక్షంలో ఎక్కువకాలం గడిపిన వ్యోమగాముల్లో రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుందని గత పరిశోధనలు వెల్లడించాయి. అదే సమయంలో బ్యాక్టీరియా మరింత బలపడితే ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే భవిష్యత్ మార్స్ యాత్రల్లో వ్యోమగాముల ఆరోగ్యంతో పాటు వారి శరీరంలోని సూక్ష్మజీవులను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.అయితే ఇవన్నీ ఇప్పటికైతే అవకాశాల స్థాయిలో ఉన్న అంశాలేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మార్స్‌పై గ్రహాంతర సూక్ష్మజీవులు ఉన్నట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ భవిష్యత్ అంతరిక్ష యాత్రలను మరింత సురక్షితంగా నిర్వహించాలంటే ఇలాంటి ప్రమాదాలపై ముందుగానే పరిశోధనలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

## ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు

**మొదటిపేజీ తరువాయి -** పదజాలం వాడడం మాత్రమే ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు" అని పేర్కొంది."ఒక మాటను అశ్లీలమైనదిగా పరిగణించాలంటే, అది కామ ప్రకోపాన్ని కలిగించేదిగా, కామవాంఛలను రేకెత్తించేదిగా ఉండాలి. దానిని వినే లేదా చూసే వారి మనస్సులను భ్రష్టు పట్టించేలా, చెడగొట్టేలా ఉండాలి. ఈ ప్రమాణాల ప్రకారం పరిశీలిస్తే, ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలన్నీ నిజమేనని పూర్తిగా అంగీకరించినప్పటికీ, ఆ మాటలను అశ్లీలమైనవిగా పరిగణించలేము. ఇలాంటి మాటలు ఎంత దూషణతో కూడినవి, వినడానికి వీలులేనివి లేదా సభ్యత లేనివి అయినప్పటికీ, ఇవి ఐపీసీ సెక్షన్ 294 (బి) పరిధిలోకి రావు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "ఈ బూతు మాటలు, అసభ్య పదజాలం వాడకం వల్ల బహిరంగ ప్రదేశంలో ఇతరులకు, ముఖ్యంగా ఫిర్యాదుదారునికి తీవ్ర అసౌకర్యం లేదా ఇబ్బంది కలిగిందని ఎక్కడా రుజువు కాలేదు. ఈ సెక్షన్‌కు ఇది అత్యంత కీలకమైన నిబంధన. ఇది లేనప్పుడు, ఐపీసీ సెక్షన్ 294 (బి) కింద నేరం జరిగినట్లు పరిగణించలేము" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

### కేసు నేపథ్యం

తమిళనాడులో 2017 ఆగస్టులో ఒక వ్యవసాయ భూమి గురించి వివాదం చెలరేగింది. ఆ సమయంలో పిటిషనర్‌కు, అతడి బావమరిదికి మధ్య వాగ్వాదం జరిగింది. రెండు రోజుల తర్వాత, అదే భూమి విషయమై మేనల్లుడితో పిటిషనర్ మళ్లీ గొడవ పడ్డాడు. దీనితో ఆయన బావమరిది జోక్యం చేసుకున్నాడు. కోపంతో పిటిషనర్ తన బావమరిదిని అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషించాడు. దీనితో ట్రయల్ కోర్టు ఐపీసీ సెక్షన్ 294 (బి) అశ్లీలత, సెక్షన్ 326 (తీవ్రంగా గాయపరచడం), 506 (ఐఐ) (క్రిమినల్ బెదిరింపు)తో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద దోషిగా తేల్చింది. దీనితో పిటిషనర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. మద్రాస్ హైకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఆరోపణల నుంచి పిటిషనర్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. కానీ ఐపీసీ సెక్షన్ల కింద విధించిన శిక్షలను మాత్రం సమర్థించింది. ఈ నేపథ్యంలోనే సదరు పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

### పోక్సో దుర్వినియోగం

మరో కేసు విచారణ సందర్భంగా, పరస్పరం ప్రేమించుకున్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. యుక్త వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో (గాజూూ) చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైనదేనా అని ప్రశ్నించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం, యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన కేసును సుమోటోగా విచారణ చేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు వ్యాఖ్యానించింది.

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు

**మొదటిపేజీ తరువాయి -** కొణిదెల, దయకుమార్‌లను ట్యాగ్ చేయడం విశేషం. దీంతో పాటు 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

## ఏపీలో మళ్లీ కరోనా కలకలం

**మొదటిపేజీ తరువాయి -** బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.వివరాల్లోకి వెళ్తే, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు క్యాన్సర్ చికిత్స నిమిత్తం పుదుచ్చేరిలో ఉండగా, అతనికి కరోనా సోకినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, బాలుడి కుటుంబ సభ్యులకు, సమీప బంధువులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ అని తేలింది.మరోవైపు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడుకు చెందిన 13 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత సమస్యలతో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో డయాలసిస్ చేయించుకుంటోంది. జ్వరం, ఇతర లక్షణాలు కనిపించడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించగా, ఆమెకు కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. దీంతో బాలికను వెంటనే ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో కూడా నెగటివ్ అని నిర్ధారణ అయ్యింది.రాష్ట్రవ్యాప్తంగా జూన్ 26 నుంచి జులై 16 మధ్య కాలంలో మొత్తం 12 కోవిడ్ కేసులు, నాలుగు మరణాలు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు వెలుగు చూశాయి. మరణించిన వారంతా రక్తపోటు, మధుమేహం, కిడ్నీ వ్యాధుల వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారేనని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతానికి కేసుల వ్యాప్తి తీవ్రంగా లేనందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది.

## కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం.. సముద్రంపాలైన ముడిచమురు

**మొదటిపేజీ తరువాయి -** ఘటనతో సముద్ర జలాల్లోకి చమురు వేగంగా వ్యాపించడంతో పర్యావరణానికి వాటిల్లే నష్టంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.వివరాల్లోకి వెళ్తే, పైప్‌లైన్ లీకేజీ కారణంగా భారీ పరిమాణంలో ముడి చమురు సముద్రపు నీటిలో కలిసిపోయింది. ఈ ఘటనపై పోర్టు యాజమాన్యం తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించింది. కాంట్రాక్టర్లు, అధికారులు మరియు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ నిర్వహణ లోపం తలెత్తి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.తూర్పు తీరంలో అత్యంత కీలకమైన ప్రైవేట్ డీప్-వాటర్ పోర్టుగా ఉన్న కృష్ణపట్నం నుంచి ముడి చమురు, వంట నూనెల వంటి ద్రవ సరకు రవాణా భారీ స్థాయిలో జరుగుతుంది. నిబంధనల ప్రకారం, ఈ పోర్టు ఇండియన్ కోస్ట్ గార్డ్ సహకారంతో టైర్-1 ఆయిల్ స్పిల్ స్పందన సామర్థ్యాలను కలిగి ఉంది.

## పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం


**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలు మరో మలుపు తిరిగాయి. జోర్డాన్ సరిహద్దుల్లో ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ల దాడిని తిప్పికొట్టే క్రమంలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) అధికారికంగా ధ్రువీకరించింది. జులై 17న జరిగిన ఈ దాడిలో మరొక అమెరికా సైనికుడు గల్లంతయ్యాడని, నలుగురు తీవ్రంగా గాయపడ్డారని పెంటగాన్ తెలిపింది. ఈ తాజా మరణాలతో ఈ యుద్ధంలో ఇప్పటివరకు చనిపోయిన అమెరికా సైనికుల సంఖ్య 16కు చేరగా, 430 మందికి పైగా గాయపడ్డారు.ఈ పరిణామాల మధ్య, ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "అమెరికా శత్రువు యుద్ధాన్ని ప్రేరేపిస్తూ, దాని పర్యవసానాలను ఎదుర్కొంటోంది. ఇరాన్ దేశం , దాని మద్దతు దళాలు (యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్) అమెరికాకు మరచిపోలేని పాఠాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన ఏ ఒప్పందమైనా 'నిరుపయోగం.. చెల్లనిది' అని ఆయన కొట్టిపారేశారు.

## గాంధీభవన్‌కు రావొద్దు.. నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు!




**మొదటిపేజీ తరువాయి -** విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు.ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడాన్ని అవకాశంగా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి 10 మంది ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూనే ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. బాధ్యతలు నిర్వర్తించని ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇప్పటివరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 489 ఎస్ఐఆర్ సమావేశాలు నిర్వహించినట్లు సీఎం తెలిపారు. వెనుకబడిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది నాయకులు హైదరాబాద్‌కే పరిమితమై పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు ఎవరూ రావొద్దని సీఎం స్పష్టం చేశారు. ఛైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగేవారికి నియామకాలు ఉండవని తేల్చిచెప్పారు. జులై 30న మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని వెల్లడించారు.బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని సీఎం సూచించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నివేదికలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పార్టీ బీఎల్ఏలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.రానున్న పది రోజులు నాయకులంతా నియోజకవర్గాల్లోనే పర్యటించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్ బృందం బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని ప్రకటించారు.

## హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం




**మొదటిపేజీ తరువాయి -** ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న తీవ్ర ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డి అనే ట్రైనీ ఐపీఎస్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.వివరాల్లోకి వెళితే, అకాడమీలో శిక్షణ పొందుతున్న ఒక ఐపీఎస్ ప్రొబేషనర్, తన సహోద్యోగి అయిన ఉదయ్ కృష్ణారెడ్డి తనను కొంతకాలంగా వేధిస్తున్నాడని అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు తనకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడంతో పాటు, మానసికంగా వేధిస్తూ, దుర్భాషలాడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ క్రమంలో జూలై 9న నిందితుడు తనను బలవంతంగా ఒక గదిలోకి లాక్కెళ్లాడని, జుట్టు పట్టుకుని మెడపై కత్తి పెట్టి బెదిరించాడని బాధితురాలు ఆరోపించారు. అంతేకాకుండా, ఆమె ప్రైవేట్ వీడియోలను బలవంతంగా చిత్రీకరించి, ఆమె మొబైల్ ఫోన్ లాక్కుని, ఆ వీడియోలను ఆమె భర్త వాట్సాప్‌కు పంపాడని ఫిర్యాదులో వివరించారు.బాధితురాలి ఫిర్యాదు స్వీకరించిన అత్తాపూర్ పోలీసులు, నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (దీచీూ)లోని సెక్షన్లు 74, 75, 77, 315(2)తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66(ఇ) కింద కేసు నమోదు చేశారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం




**మొదటిపేజీ తరువాయి -** సోమవారం శ్రీకారం చుట్టబోతున్నట్లుగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను సోమవారం విడుదల చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో తొలివిడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్ల నిర్మాణానికి కోట్ల రూపాయల విలువైన ప్రాంతాలను గుర్తించినట్లుగా వివరించారు.అధునాతన సౌకర్యాలతో పది అంతస్తుల భవనాల నిర్మాణం చేపట్టి పేదలకు అందిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ యజ్ఞంలా కొనసాగుతుందని వివరించారు. రెండో విడతలో ప్రకటించిన 2.5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా నగరంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ఇప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా సాకారం చేయబోతోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కుటుంబాల జీవనోపాధికి, పిల్లల చదువులకు, ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. గతేడాది మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో రెండు లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, లక్షలాది కుటుంబాలు ఇప్పటికే గృహప్రవేశం చేసినట్లు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని, గతేడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: జగదీశ్వర్ గౌడ్

**మియాపూర్ ప్రజా షెల్టర్స్ కాలనీ సమస్యలపై వినతిపత్రం అందజేత**

**సానుకూలంగా స్పందించిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్**

**శేరిలింగంపల్లి,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** ప్రజా సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మియాపూర్ ప్రజా షెల్టర్స్ కాలనీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు & చైర్మన్, మియాపూర్ జనరల్ సెక్రటరీ శ్రీ యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో కాలనీలో సుదీర్ఘకాలంగా నెలకొన్న పలు ప్రజా సమస్యలపై జగదీశ్వర్ గౌడ్‌కు వినతిపత్రాలను సమర్పించారు.



**తక్షణ చర్యలకు ఆదేశం:**

వినతిపత్రాలను స్వీకరించిన జగదీశ్వర్ గౌడ్ కాలనీవాసుల సమస్యలను ఓర్పుగా ఆలకించారు. వీటిలో అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలపై ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఆయన కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

**భారీగా తరలివచ్చిన కాలనీవాసులు:**

ఈ కార్యక్రమంలో ప్రజా షెల్టర్స్ కాలనీ అధ్యక్షుడు శంకర చారి, ముఖ్య నాయకులు గోపాలకృష్ణ, రామకృష్ణ, విజయ్ కుమార్, శ్రీనివాస్, వెంకట చంద్రశేఖర్, శివకుమార్, నాగూర్‌వలి, బాలాజీ, వేణుగోపాల్, సాంబశివరావు, రాఘవేంద్ర, మధు, రత్నాచారి, ప్రవీణ్, వంశీ, సాయి, వినయ్ తో పాటు కాలనీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఆధ్వర్యంలో

**బీరప్పగడ్డ ముస్లిం బస్తీలో విజయవంతంగా నిర్వహించిన సర్ అవగాహన సహాయ కేంద్రం**

**ఉప్పల్,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఆధ్వర్యంలో బీరప్పగడ్డ డివిజన్ ముస్లిం బస్తీలో నేడు సర్ అవగాహన మరియు సహాయ కేంద్రం విజయవంతంగా నిర్వహించబడింది. తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అర్హులైన ఓటరు హక్కును పరిరక్షించేందుకు, సర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, అవసరమైతే వెంటనే సవరణలు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే కొత్త ఓటరు నమోదు, పేరు, చిరునామా, వయస్సు సవరణలు, సర్ దరఖాస్తుల నింపడం, ఇప్పటికే దరఖాస్తు చేసిన వారికి అవసరమైన మార్గదర్శకత్వం, నోటీసులు అందుకున్న వారు సమర్పించాల్సిన పత్రాలపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ బజార్ జగన్నాథ్ గౌడ్ , టీపీసీసీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ సందీప్ భూషణ్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా. ఎ. అంజయ్య , గవ్వల సంతోష్ హాజరై ప్రజలకు సర్ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని అల్తాఫ్, రాజశేఖర్, అమీర్, మొహ్సిన్, జునైద్, అఫ్రోజ్మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ సర్ అవగాహన కార్యక్రమానికి ముస్లిం బస్తీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సేవలను వినియోగించుకోవడంతో పాటు, తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు అవసరమైన సూచనలు, సహాయాన్ని పొందారు. ప్రజల నుండి విశేష స్పందన లభించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.





# కుషాయిగూడలో మాంగల్య గ్రాండ్ ఎగ్జిబిషన్‌కు అనసూయ శుభారంభం

**పట్టు చీరల నుంచి మోడ్రన్ డ్రెస్సుల వరకు.. మాంగల్యలో మెగా ఆఫర్లు**

**కాప్రా,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడలోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న మాంగల్య గ్రాండ్ ఎగ్జిబిషన్--2026ను ప్రముఖ బుల్లితెర యాంకర్, సినీ నటి అనసూయ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా మాంగల్య యాజమాన్యం ఆమెకు ఘన స్వాగతం పలికి జ్ఞాపికతో సత్కరించింది. ఈ కార్యక్రమానికి వ్యాపారవేత్తలు, ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఫ్యాషన్ రంగ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు, వినియోగదారులు హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా మాంగల్య షాపింగ్ మాల్ యాజమాన్యం మాట్లాడుతూ, వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యత కలిగిన వస్త్రాలను సరసమైన ధరల్లో అందించాలనే లక్ష్యంతో ఈ గ్రాండ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టు చీరలు, డిజైనర్ చీరలు, చుడీదార్లు, వెస్ట్రన్ వేర్, పురుషుల దుస్తులు, చిన్నారుల రెడీమేడ్ వస్త్రాలు, లుంగీలు, ధోతీలు, దుప్పట్లు తదితర విభాగాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని జూలై 19 నుంచి 26 వరకు కొనసాగే ఈ ప్రత్యేక ఎగ్జిబిషన్‌లో భారీ తగ్గింపులు, ఆకర్షణీయమైన బంపర్ ఆఫర్లు, ప్రత్యేక కొనుగోలు పథకాలు అందుబాటులో ఉంటాయని యాజమాన్యం తెలిపింది. నాణ్యత, మన్నిక, వినియోగదారుల విశ్వాసమే తమ సంస్థకు బలమని, కుషాయిగూడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు నచ్చిన వస్త్రాలను తక్కువ ధరలకు కొనుగోలు చేయాలని ఆహ్వానించారు. ముఖ్య అతిథి అనసూయ మాట్లాడుతూ, మాంగల్య షాపింగ్ మాల్ వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్న సంస్థగా మంచి గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో ఇలాంటి ప్రత్యేక ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమని, ప్రజలు ఈ ఆఫర్లను వినియోగించుకుని కుటుంబ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన వస్త్రాలను కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం ఆమె ఎగ్జిబిషన్‌లోని పలు స్టాళ్లను సందర్శించి వస్త్రాల కలెక్షన్‌ను పరిశీలించారు.



# కొండాపూర్‌లో కన్నులపండువగా శ్రీ జగన్నాథ రథయాత్ర

**భారీగా తరలివచ్చిన భక్తజనసందోహం**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

**కొండాపూర్,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో శ్రీ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. బంజారాహిల్స్ ఇస్కాన్ టెంపుల్, హరే కృష్ణ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక వేడుకను కన్నులపండువగా నిర్వహించారు. తెలంగాణ యాదవ కురుమ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ ప్రత్యేక పర్యవేక్షణలో జరిగిన ఈ పవిత్ర యాత్రలో శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జగన్నాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తజన సముద్రమైన రాఘవేంద్ర కాలనీ: ఈ రథోత్సవానికి కొండాపూర్ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఐటీ కారిడార్ నలుమూలల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. దీంతో కాలనీ వీధులన్నీ భక్తజనసందోహంతో కిక్కిరిసిపోయాయి. అశేష జనవాహిని మధ్య జగన్నాథుడి రథం ముందుకు సాగుతుండగా, స్వామివారి రథాన్ని లాగేందుకు, తాడును స్పర్శించేందుకు భక్తులు ఎగబడ్డారు. రథం వెళ్లే దారంతా భక్తులు కర్పూర నీరాజనాలు పడుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ?జగన్నాథుడి కరుణామృతం: సృష్టికి మూలకారకుడైన ఆ జగన్నాథుడు, సుభద్రా దేవి, బలభద్ర సమేతంగా స్వయంగా ఆలయం వెలుపలికి వచ్చి భక్తులకు దర్శనమివ్వడమే ఈ రథయాత్ర ప్రత్యేకత. కులమతాలకు అతీతంగా, పేద ధనిక బేధం లేకుండా ప్రతి ఒక్కరికీ తన కరుణాకటాక్షాలను అందించడానికే స్వామివారు వీధుల్లోకి వస్తారని ఇస్కాన్ ప్రతినిధులు ఈ సందర్భంగా వివరించారు. ?రథయాత్ర పొడుగునా హరేకృష్ణ భక్తుల హరినామ సంకీర్తనలు, మృదంగాలు, తాళాల ధ్వనులు, భక్తుల జయజయధ్వానాలతో కొండాపూర్ ప్రాంతం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించిపోయింది. యాత్రకు వచ్చిన భక్తులందరికీ నిర్వాహకులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేయడంతో పాటు, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, వివిధ ఆధ్యాత్మిక బృందాల ప్రతినిధులు, వేలాది మంది భక్తులు పాల్గొని తరించారు.






# శ్రీశ్రీ నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)

**ఉప్పల్,జులై 19 .అక్షర టైమ్స్ : -(ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** ఉప్పల్ పరిధిలోని బీరప్పగడ్డలో ఘనంగా నిర్వహించిన శ్రీశ్రీ నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం పూజా కార్యక్రమాలలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందీప్ భూషణ్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా. అద్ల ఆంజయ్య మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు మరియు భక్తులను కలిసి మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి నిర్వహించే ఇలాంటి మహోత్సవాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ మహోత్సవానికి ఆహ్వానించి ఆత్మీయంగా ఆతిథ్యం ఇచ్చిన జంగయ్య, శ్రావణ్, శ్రీకాంత్, కృష్ణ, రవి, జగన్ తో పాటు వారి కుల సంఘ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, కాలనీ ప్రజలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు. శ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఇర్షాద్ ఖాన్ ఆకాంక్షించారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## ఆంధ్రా హాస్పిటల్స్, మహేష్ బాబు ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**నరసరావుపేట,జులై 19 .అక్షర టైమ్స్ :** స్థానిక పల్నాడు రోడ్ లో గల శ్రీత్రికోటేశ్వర స్కాన్ సెంటర్ నందు ముందుగా ప్రకటించిన విధంగా మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ లింగస్వామి పర్యవేక్షణలో విజయ వంతం అయింది. సమయం తక్కువగా ఉన్నప్పటికీ సుమారు 20 మంది చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించమని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగస్వామి మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలు చిన్న పిల్లల తల్లి తండ్రులు ఎవరు డబ్బుల గురించి ఆలోచించకుండా వారి పిల్లలను ఇలా వైద్యశిబిరం ఏర్పాటు చేసినప్పుడు తీసుకొని వస్తే వాళ్లను పరీక్షించి అవసరమైన వారికి హీరోమహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా పల్నాడుజిల్లా నరసారావుపేట టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు మహ్మద్ ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో డాక్టర్ లింగస్వామి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు అభిమానులు నబీబాజీ, చిన్ని కృష్ణ, అబ్దుల్ సలామ్, నాగేశ్వరరావు, షశీషిర్‌అలీ, థామస్, కోటేశ్వరరావు, షణ్ముఖసాయి, సుభాని, మీరావలి మరియు ఆంధ్రా హాస్పిటల్స్ పి ఆర్ ఓ అజయ్ మరియు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఘట్టమనేని జయకృష్ణ జన్మదినవేడుకలు



**నరసరావుపేట,జులై 19 .అక్షర టైమ్స్ :** స్థానిక లూథరన్ అంధుల పాఠశాలలో సూపర్ స్టార్ కృష్ణ మనవడు హీరో రమేష్ బాబు కుమారుడు అయిన ఘట్టమనేని జయకృష్ణ జన్మదిన వేడుకలు శనివారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు మహ్మద్ ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో ఘట్టమనేని జయకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అంధుల పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు కేక్ ముక్కలతో పాటుగా బిస్కెట్ ప్యాకెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మహ్మద్ ఫారూఖ్ బాబు మాట్లాడుతూ హీరో జయకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఇలా పాఠశాల విద్యార్థిని, విద్యార్థుల మధ్య జరుపుకోవటం చాల ఆనందంగా ఉందని తెలియజేశారు. అలాగే ఈనెల 30వ తేదీన ఘట్టమనేని జయకృష్ణ నటించిన మొదటి చిత్రం “శ్రీనివాస మంగాపురం” చిత్రాన్ని ప్రేక్షకులు, సినీ అభిమానులు మరియు సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు అభి మానులు అందరూ ఆదరించి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అభిమానులు నబీ బాజీ, చిన్ని కృష్ణ, అబ్దుల్ సలామ్, నాగేశ్వరరావు, షశీషీర్‌ఆలీ, థామస్ , కోటేశ్వరరావు, షణ్ముఖసాయి, సుభాని, మీరావలి మరియు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్





**పటాన్చెరు,జులై19.అక్షర టైమ్స్:-(ప్రతినిధి ఎం.వీరేష్)** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్‌లో మిరియాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మిరియాల ప్రీతం జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మిరియాల ప్రీతమ్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. అలాగే, పటాన్చెరు డివిజన్ సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంకర్ నగర్‌లో డొక్కు భారతీ కుమారి పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు

**ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి**



**కొండాపూర్,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** కొండాపూర్ విభాగం ప్రజలకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా, ఇప్పటివరకు ప్రత్యేక సవరణ పత్రం నింపని వారు లేదా దరఖాస్తు చేయని వారు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా కోరారు. ఓటరు నమోదు అధికారులు అందుబాటులో ఉండే వివరాలు ?19 జూలై 2026న ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ క్రింది ప్రాంతాలలో అధికారులు అందుబాటులో ఉంటారని ?శ్రీ రామ ఉన్నత పాఠశాల. ప్రేమ్‌నగర్ ఏ-బ్లాక్ ఈద్గా అందించే సేవలు ?ప్రత్యేక సవరణ పత్రాలు నింపడం కొత్త దరఖాస్తులు సమర్పించడం ఓటర్లకు అవసరమైన సహాయం అందించడం కాబట్టి ఇప్పటివరకు సవరణ పత్రం సమర్పించని ప్రతి ఓటరు తమకు సమీపంలోని శ్రీ రామ ఉన్నత పాఠశాల, ప్రేమ్‌నగర్ ఏ-బ్లాక్ ఈద్గా వద్దకు వెళ్లి అధికారుల సహాయంతో తమ పత్రాన్ని పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మీ పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**మీ ఓటు -- మీ హక్కు:**

పత్రికా ప్రకటన ప్రతులకు మరియు ఆఫీస్ రికార్డుల కోసం ఉపయోగపడేలా దీనిని ఒక అందమైన పిడిఎఫ్ రూపంలో కూడా పైన జతపరిచాను. డౌన్‌లోడ్ చేసుకొని వాడుకోవచ్చు.

## ఉచిత ఎముకల వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సింధు ఆదర్శ్ రెడ్డి





**భారతి నగర్‌జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.వీరేష్)** స్థానిక ఓల్డ్ ఎం.ఐ.జి కాలనీలోని బి పార్క్ ప్రాంగణంలో, హౌసింగ్ సొసైటీ మరియు యశోదా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఎముకల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యశోదా ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు కీర్తి, నిఖిల్ కాలనీ వాసులకు ఎముకలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు అందించారు. స్థానికుల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు రావడం అభినందనీయమని సింధు ఆదర్శ్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు ఇటువంటి వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. సమాజ హితం కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు, డైరెక్టర్ రాధాకృష్ణ, నాయకులు రాణి యాదవ్, సంపత్ గౌడ్, రాకేష్, అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## భగాయత్ ఫేస్-2లో సమస్యల పరిష్కారానికి కృషి..

**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డి**





**ఉప్పల్,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ ఫేస్-2లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ఆహ్వానం మేరకు పరమేశ్వర్‌రెడ్డి ఆదివారం పేస్-2లో విస్తృతంగా పర్యటించారు. అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. దేవాలయం, కమ్యూనిటీ సెంటర్‌కు కేటాయించిన స్థలాల పరిరక్షణకు ప్రహారీగోడలను నిర్మించాలని కోరారు. ఇదే కాకుండా కాలనీలో పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రహదారులను సైతం నిర్మించడంతో పాటు ఉన్న రహదారులను మరమ్మతు చేయించాలన్నారు. ఇక్కడి ఖాళీ స్థలాలలో వ్యర్థాలను పోస్తుండటంతో దుర్గంధంగా మారిందన్నారు. పోలీసుల నిఘాను సైతం పెంచాలన్నారు. వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తావించిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థలాల పరిరక్షణకు ప్రహారీగోడల నిర్మాణంతో పాటు రహదారుల ఏర్పాటు, మరమ్మతులను సైతం చేపట్టనున్నట్టుగా చెప్పారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు

## ఉప్పల్ లో పోచమ్మకు కుమ్మరుల తొలి బోనం.!

**ముఖ్య అతిథిగా హాజరైన పరమేశ్వర్ రెడ్డి**





**ఉప్పల్,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** ఉప్పల్ లో బోనాల సందడి మొదలైంది.ఆదివారం పోచమ్మకు కుమ్మరులు తొలి బోనం చేశారు.కుమ్మరుల తొలి బోనంకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుమ్మరి పెద్దలతో కలిసి ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో గుమిడెల్లి నారాయణ ,గుమిడెల్లి యాదయ్య ,గుమిడెల్లి మల్లేష్, భాస్కర్ ,బుల్లెట్ కృష్ణ,గుమిడెల్లి రాజు,గుమిడేలి మహేష్,పొట్లూరి కృష్ణ,పొట్లూరి వెంకటేష్,పొట్లూరి శ్రీనివాస్,మహేష్,సదాసాయి భిక్షపతి,గుమిడేలి శ్రీనివాస్,గుమిడెల్లి అశోక్, ప్రశాంత్ రెడ్డి, నరేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు

## మహిళల అభ్యున్నతికి
## కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి

**మహిళలు విద్యారంగంలో అగ్రగామిగా వెలుగొందాలి**

**జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్ వెల్లడి**





**గోకవరం,జులై 19 .అక్షర టైమ్స్ :** మహిళా అభ్యున్నత కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, మహిళామణులు అన్ని రంగాల్లో రాణించాలని జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్ తెలిపారు. మండలంలో కొత్తపల్లి గ్రామంలో ఆదివారం నాడు రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ మహిళ వసతి గృహంలో విద్యార్థినులకు రాష్ట్ర ప్రభుత్వం వారు కల్పించిన వస్త్ర సౌకర్యం దుప్పట్లు మరియు నైట్ డ్రెస్ లు మరియు ఉన్ని చలి కోటులను భరత్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్థానిక శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కామరాజుపేట గ్రామ మాజీ సర్పంచ్ అడపా వెంకట్రావు, కామరాజుపేట సొసైటీ అధ్యక్షుడు పిర్ల వెంకటేశ్వరరావు, కొత్తపల్లి గ్రామ తెలుగుదేశం నాయకులు తోట బాబి, పోతాబత్తుల శ్రీను, కఠారి అంజనీ కుమార్, టిడిపి మహిళ నాయకురాలు రాపాక లక్ష్మి, వసతి గృహం వార్డెన్ జ్యోతి మరియు గోకవరం బీసీ సంక్షేమ సంఘం వసతి గృహం వార్డెన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ బాలికల ప్రత్యేక వసతి గృహం ని అకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ





**కోరుకొండ,జులై 19 .అక్షర టైమ్స్ :** రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ నేడు కోరుకొండ బాలికల హాస్టల్ అకస్మిక తనిఖీ చేసారు హాస్టల్లో అందుతున్న పలు సౌకర్యాలపై ఆరా తీశారు హాస్టల్ నిర్వహణ, పౌష్టికాహారం, ఆహార నాణ్యత, నేర్పుతున్న చదువులు, అందుతున్న బట్టలు, హాస్టల్లో శుభ్రత, బాలికల ఆరోగ్యం, క్రమశిక్షణ వంటి అంశాలపై నేరుగా బాలికలను అడిగి, వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు, ఏవైనా తప్పులుంటే వెంటనే సరిదిద్దుకోవాలి, లేదంటే చర్యలు తప్పవు. దూర ప్రాంతాల నుంచి చదువు కోసం వచ్చిన విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడమే మన ప్రధాన బాధ్యత. ఈ బాలికలే రేపటి మన భారతదేశపు భవిష్యత్తు అని దానికి అనుగుణంగా అందరూ క్రమశిక్షణతో విద్యార్థుల భవిష్యత్తు కోసం కష్టపడాలని హాస్టల్ నిర్వాహకులకు ఎమ్మెల్యే ఆదేశం.హాస్టల్ అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షించి, వాటిని పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు.

## సర్ ప్రక్రియలో కాంగ్రెస్ సేవా బాట సర్ సజావుగా..

**సేవలు వేగంగా**

**సర్ సహాయ కేంద్రాలను పరిశీలించిన పరమేశ్వర్ రెడ్డి**



**మల్లాపూర్,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** ఉప్పల్ నియోజకవర్గంలో సర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలందించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శక్తి సాయి నగర్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వి. కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఆదివారం సందర్శించిన ఆయన అక్కడి ఏర్పాట్లు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా సర్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన దరఖాస్తుల నింపడం, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడం, సందేహాలను నివృత్తి చేయడం వంటి అంశాల్లో సహాయ కేంద్రాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని అన్నారు.సహాయ కేంద్రాలు కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితం కాకుండా, ఓటర్లకు సరైన మార్గనిర్దేశం చేసే సేవా కేంద్రాలుగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ ప్రతి దరఖాస్తు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్ ప్రక్రియలో ఎలాంటి అపోహలు, అనుమానాలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించడం కార్యకర్తల బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్న ఆయన, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో కొనసాగేందుకు కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, వారికి అవసరమైన సహాయం అందిస్తూ సేవాభావంతో పనిచేయాలని కోరారు. శక్తి సాయి నగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రం ద్వారా ఇప్పటికే పలువురు ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవడంతో పాటు అవసరమైన దరఖాస్తులను సమర్పిస్తున్నారని, ఇలాంటి కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పరమేశ్వర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సర్ ప్రక్రియ విజయవంతం కావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీలత, శక్తి సాయి నగర్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వి. కృష్ణ, జమీలా బేగం, సాయి గౌడ్, నెమలి అనిల్, రాజు గౌడ్, బాలరాజ్ గౌడ్, పర్వతాలు, బెల్లం గట్టయ్య, అన్వర్ పాషా, నదీమ్, జానీ భాషా, సుజాత, లావణ్య, సోనీ గౌడ్, జేష్రత్ భాను, లలిత, రజని రెడ్డి, విజమ్మ, నరేష్, లక్ష్మీరాజు, ప్రశాంత్, లక్ష్మణ్ శివారెడ్డి తదితర శక్తి సాయి నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆషాఢ శోభలో బంగారు మైసమ్మకు సాక... భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

**శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో**

**మహిళల సామూహిక ఆరాధన**



**కుషాయిగూడ,జులై 19 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో వెలసిన శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం తొలి ఆదివారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కాలనీలోని మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి సాక సమర్పించి, దీపారాధన, నైవేద్యాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కళకళలాడగా, భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలు, మహిళల జైజైధ్వానాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఆషాఢ మాసానికి తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందని, ఈ నెలలో అమ్మవారిని ఆరాధించడం వల్ల కుటుంబాలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమయ్యే ఈ సమయంలో ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులతో పాటు ప్రజల ఆరోగ్యం, గ్రామాలు, పట్టణాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి బోనం, సాక సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు కేవలం పండుగ మాత్రమే కాకుండా భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. తొలి ఆదివారం నుంచి బోనాల ముగింపు వరకు ప్రతి ఆదివారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తూ అమ్మవారిని కొలుస్తారని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, వ్యాధులు, విపత్తులు దూరమై ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. అనంతరం మహిళలు అమ్మవారికి హారతులు సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, కార్యక్రమం మొత్తం భక్తి పారవశ్యంతో సాగింది. ఈ కార్యక్రమంలో కాలనీలోని మహిళలు, యువతులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మర్డర్ కేసులో నిందితులు అరెస్ట్

**వివరాలు తెలియజేసిన కావలి డిఎస్పి వివి.రమణ కుమార్**





**కావలి,జులై 19 .అక్షర టైమ్స్ :** కావలి రూరల్ మండలం సర్వాయిపాలెం పంచాయతీ పరిధిలోని త్రాగేటివారిపాలెం గ్రామానికి చెందిన చాట్ల వాసు మర్డర్ కేసు నిందితులను కావలి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు తన కార్యాలయంలో కావలి డిఎస్పి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడి చేశారు. సందర్భంగా కావలి డిఎస్పి రమణ కుమార్ మాట్లాడుతూ రూరల్ మండల పరిధిలో చాట్ల వాసు పై ఇటీవల జరిగిన పాతాక్షల నేపథ్యంలో తీవ్రంగా గాయపరచిన వ్యక్తులను ముద్దాయిల జాబితాలో చేర్చి అరెస్టు చేసినట్లు తెలిపారు. పాత కక్షలు నేపథ్యంలో మేకలకు సంబంధించిన విషయమై కక్ష సాధింపుగా ఈ ఉదాంతం చోటుచేసుకుందని విచారణలో తెలిసిందని వెల్లడి చేశారు. ఈ మర్డర్ కేసులో ఏ 1 ముద్దాయిగా త్రాగేటివారిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ నాయకులు మంద మధు ఆధ్వర్యంలో వాసును హతం చేయాలని జరిగిన పన్నాగంలో భాగమే ఈ మర్డర్ అని వెల్లడి చేశారు. అతనికి సహకరించిన ఎ2 ముద్దాయిగా రవిచంద్ర, ఏ 3 ముద్దాయిగా పసుపులేటి గణపతి, ఏ 4 ముద్దాయిగా దేవరపల్లి నవీన్ అనే వారిని చార్జిషీట్లో పొందపరచినట్లు పేర్కొన్నారు. వీరిలో ముగ్గురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు, మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరు నేరం చేసిన విధానాన్ని వివరించారు. వాసు కు మద్యం సేవింపజేసి అనంతరం మరో ఇద్దరు మంచపు కోడు లతో దాడి చేసి పడవేశారని తెలిపారు. గమనించిన వారు చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించగా నారాయణ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. కావలి రూరల్ సీఐ జి రాజేశ్వరరావు కేసు దర్యాప్తును అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి చాకచక్యంగా ముద్దాయిలను గుర్తించి అరెస్టు చేశారన్నారు. ఆధారాల మేరకు కట్టకిందపాలెం గ్రామానికి చెందిన తుళ్లూరు జనార్దన్ వద్ద నుండి చాట్ల వాసు కుటుంబ సభ్యులు మేకలను కాసేందుకు జరిగిన ఒప్పందంలో చోటు చేసుకున్న సందర్భం నేపద్యం, అందుకు సంబంధించి మంద మధును కలిసి గతంలో నుంచే వాసు మంద మధుమధ్య ఉన్న మనస్పర్ధలు కాస్త పెరిగి ఈ ఉదంతానికి దారి తీసింది అన్నారు. నిందితులను చట్టం ప్రకారం శిక్షకు అర్హులని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగుతుందన్నారు. చిన్నచిన్న విషయాలకు మర్డర్లు చేసుకునే అంతటి ఘోరమైన సంఘటనలు దారితీస్తున్న సందర్భాలు ప్రతి ఒక్కరు గమనించి, సంయమనం పాటించి, ఆలోచనతో నేరాలకు పాల్పడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని ప్రజలకు హితవు పలికారు. ఈ సందర్భంగా కావలి రూరల్ ఎస్సై పాల్గొన్నారు.

## కన్నీటి వీడ్కోలు మధ్య చాట్ల వాసు అంత్యక్రియలు

**తాగేటివారి పాలెంలో విషాద ఛాయలు**

**బంధువులు, గ్రామస్తుల ఆర్తనాదాలు**

**న్యాయం జరిగే వరకు పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే భరోసా**

**గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల ఘన నివాళులతో తుది వీడ్కోలు**





**కావలి,జులై 19 .అక్షర టైమ్స్ :** కావలి రూరల్ మండలం తాగేటివారిపాలెం గ్రామంలో టీడీపీ కార్యకర్త చాట్ల వాసు మృతితో గ్రామమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆదివారం వాసు అంత్యక్రియలు గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల సమక్షంలో కన్నీటి వీడ్కోలు మధ్య నిర్వహించారు. వాసు మృతితో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు అక్కడికి చేరుకున్న ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. అంత్యక్రియల సందర్భంగా గ్రామస్తులు, స్నేహితులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని చాట్ల వాసుకు ఘన నివాళులు అర్పించారు. వాసు భౌతికకాయాన్ని చివరిసారి చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కూటమి నాయకులు గ్రామానికి చేరుకుని వాసు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, జరిగిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని, న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు భరోసా ఇచ్చారు. వాసు కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు మాట్లాడుతూ, కుటుంబం ఎదుర్కొంటున్న కష్టసమయంలో పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కూడా వాసు కుటుంబానికి అండగా నిలిచాడని అవసరమైన సహాయం అందించేందుకు కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. వాసు మృతికి సంబంధించిన కేసులో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చాట్ల వాసు హత్య కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా చెప్పబడుతున్న వైసీపీ నాయకుడు మంద మధు మరియు అతని అనుచరుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని అన్నారు. వాసు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదే సమయంలో ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అంత్యక్రియల సందర్భంగా ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరగకుండా కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుమల రెడ్డి తన బృందంతో ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మంత్రి నారాయణ**

**త్వరలోనే కొత్త అక్రిడిటేషన్ విధానం**

**నగదు రహిత వైద్యం,ఇళ్ల స్థలాలపై కీలక ప్రకటన**

**ఏ.పీ.ఎం.ఎఫ్ జిల్లా మహాసభలో పాల్గొన్న మంత్రి నారాయణ**



**నెల్లూరు,జులై 19 .అక్షర టైమ్స్ :** నెల్లూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ఏ.పి.ఎం.ఎఫ్ జిల్లా మహాసభల్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రికి ఫౌండర్ దిల్లిబాబురెడ్డి, సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా సమాజానికి దిశానిర్దేశం చేస్తుందన్నారు.జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. గతంలో ఉన్న అక్రిడిటేషన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ వివక్ష లేకుండా కొత్త అక్రిడిటేషన్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు ప్రకటించారు.అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ స్కీమ్ కింద నిరంతరాయ నగదు రహిత వైద్యం,అర్హులైన వారికి ఇళ్లు లేదా ఇంటి స్థలాల కేటాయింపును ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు.నిజాయితీ, సామాజిక బాధ్యతతో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వం-మీడియా కలిసి పనిచేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, జర్నలిస్ట్ యూనియన్ నేతలు నరసింహులు, మల్లికార్జున, వెంకట్ నారాయణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## గోకవరంలో డిగ్రీ కాలేజీని ఏర్పాటు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కు వినతిపత్రం అందించిన బిజెపి నాయకులు



గోకవరం,జులై 19 .అక్షర టైమ్స్ : గోకవరం మండలంలో వివిధ గ్రామాల ప్రజలు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్నటువంటి డిగ్రీ కాలేజీ నిర్మాణాన్ని చేపట్టాలని వారి చిరకాలవాంఛను ఎన్డీఏ కూటమి జగ్గంపేట నియోజకవర్గం శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ కి వినతి పత్రం ద్వారా తెలియజేసిన గోకవరం మండలం బిజెపి నాయకులు ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టమంగరాజుమండల అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర మాట్లాడుతూ గోకవరం మండలంలో పోలవరం ప్రాజెక్టు పునరావాస గ్రామాలు 30కి పైగా గోకవరం మండలం లో నివాసం ఉంటున్న సందర్భంగా గోకవరంలో జన సాంద్రత పెరగడం యువత ఎక్కువగా గోకవరం మండలంలో ఉండడం ఈ ప్రాంతంలో ఎక్కువగా వెనకబడిన వర్గాల వారు గిరిజన గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉండడం వలన వారు దూర ప్రాంతాలకు వెళ్లి చదవడానికి హాస్టల్స్ ఫీజులు భరించడానికి ఆర్థికంగా వెనకబడినటువంటి కారణం చేత డిగ్రీ కాలేజీ మన మండలంలో లేకపోవడం వల్ల తీవ్ర అసహనానికి గురవుతున్నారని దూరం ప్రాంతాలకు వెళ్లలేక చాలామంది యువత చదువును ఇంటర్ తోనే ఆపేసి పరిస్థితి నెలకొందని, ఇలాంటి పరిస్థితుల వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని యువతరానికి మన మండలంలోని డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయడం వలన విద్యార్థిని విద్యార్థులు ఎక్కువగా చదువుపై దృష్టి సారించడం వలన దేశ అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధి మండల అభివృద్ధి కూడా జరుగుతుందని కావున ఈ యొక్క సమస్యను తమ పరిగణలోకి తీసుకుని మండలానికి డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కోన వెంకట సురేష్ మండల పూర్వ అధ్యక్షులు ముక్క శ్రీను బిజెపి నాయకులు తామర్ల రాంబాబు మండల కోశాధికారి ముమ్మిడివరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సాగిన శ్రీ జగన్నాథ రథయాత్ర పాల్గొన్న ప్రముఖులు



భారతీనగర్/డివిజన్,జులై 19.అక్షర టైమ్స్:-(ప్రతినిధి ఏం.వీరేష్) శేర్లింగంపల్లి నియోజకవర్గంబీహెచ్ఈఎల్ ఎం.ఐ.జీ కాలనీలోని శ్రీ రామాలయంలో మూడవ శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ వేడుకలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న అతిథులకు కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవమూర్తుల రథయాత్రలో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావం, భక్తి భావాలను పెంపొందిస్తాయని అన్నారు. ధార్మిక కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యుల కృషిని ఆయన అభినందించారు. ప్రజలందరూ ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్, రఘునాథ్ రెడ్డి, కాలనీ డైరెక్టర్లు నారాయణ గౌడ్, నీలకంఠం, రామాలయం కమిటీ సభ్యులు సత్యనారాయణ, జనార్ధన్, నారాయణ, రామ్ ప్రసాద్, ఇతర నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## చిన్నారులను కిడ్నాప్ చేయించి - పిల్లలు లేనివారికి రూ.లక్షల్లో అమ్మకం : ముఠా గుట్టురట్టు

**చిన్నారి అపహరణను గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు - చిన్నారిని సురక్షితంగా తల్లి వద్దకు చేర్చిన పోలీసులు - చిన్నారి అపహరణ కేసులో విస్తుపోయే వాస్తవాలు**

హైదరాబాద్ లింగం పల్లి లో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న మూడేళ్ల బాలిక కిడ్నాప్ వ్యవ హారం అక్రమ దత్తతల పేరిట సాగుతున్న ఓ ముఠా గుట్టును రట్టు చేసింది. అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో చిన్నారిని కొందరు దుండగులు అప హరించారు. తెల్లవారుజామున తల్లి నిద్రలేచి చూసేసరికి కుమార్తె కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు, కొన్ని గంటల వ్యవధిలోనే చిన్నారిని సురక్షితంగా తల్లి వద్దకు చేర్చారు.హైదరాబాద్ లింగంపల్లి రైల్వేస్టేషన్ పరిధిలోని చిన్నారి అపహరణ కేసు కొలిక్కి వచ్చింది. అపహరణ జరిగిన గంటల వ్యవధిలోనే కేసును పోలీసులు ఛేదించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుంతకల్లు ప్రాంతానికి చెందిన గోవిందమ్మ బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి, లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో వీధి వ్యాపారిగా జీవనం సాగిస్తోంది. ఈ నెల 15న రాత్రి తన మూడేళ్ల కుమార్తె కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రైల్వే స్టేషన్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుల కదలికలను పక్కాగా గుర్తించారు. మహబూబ్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీలో స్టాఫ్ నర్స్ కమ్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న నవనీత చిన్నారి కిడ్నాప్‌నకు కీలత సూత్రధారి అని పోలీసుల దర్యాప్తులో తేలింది.పిల్లల అక్రమ రవాణా ముఠా గుట్టు రట్టు : చిన్నారులు లేని దంపతులు లక్ష్యంగా నిందితురాలు నవనీత పిల్లల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ రెడ్డి వెల్లడించారు. రాణి అనే మహిళ ఓ బిడ్డ కావాలని నవనీతను ఆశ్రయించింది. నవనీత వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన శ్రీనివాస్‌ను సంప్రదించగా లింగంపల్లి రైల్వేస్టేషన్ పరిధిలోని ఫుట్‌పాత్‌పై పడుకున్న చిన్నారిని అపహరించినట్లు సీపీ తెలిపారు. శ్రీనివాస్‌కు సహకరించిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు రమేశ్ రెడ్డి వివరించారు. చిన్నారుల అపహరణ ముఠాలో ఇంకెవరెవరు ఉన్నారు వారి ఆర్థిక లావాదేవీలు ఎలా సాగాయనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు."ఇద్దరు ఆగంతకులు వచ్చి నిద్రిస్తున్న పాపను నాలుగున్నర గంటలకు ఎత్తుకెళ్లిపోయారు. ఈ పిల్లలను ఎత్తుకొనిపోయి ఎవరికైతే పిల్లలు కావాలో వారికి అమ్మడం వంటివి చేస్తుంటారు. 15 రోజుల క్రితమే ఇలాంటి నేరం ఒక్కటి జరిగింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి సంబంధించిన ఒక పిల్లలు లేని తల్లి, ఇక్కడున్న వారి సాయంతో ఆ పిల్లలను కిడ్నాప్ చేసి వారిని కొనుక్కోవాలని వచ్చింది. అలాగే ఈ మూడేళ్ల పాప కూడా రూ.లక్షన్నరకు బేరం కుదిరింది. కొనుక్కోవాల్సిన తల్లి వద్దకు వెళ్లి చూపించాల్సినప్పుడు 'మూడేళ్ల పాపను నేను తీసుకోను. ఈ పాప కచ్చితంగా తన తల్లిని గుర్తు పడుతుంది. నా దగ్గర ఈ పాప ఉండదని' ఆమె చెప్పింది. దాంతో ఆ పాప అమ్ముడుపోలేదు. రూ.లక్షన్నర నగదు స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశాం" - రమేశ్ రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్

## ట్రాఫిక్ మార్షల్స్ అవెంజర్స్‌పై వస్తారు క్షణాల్లో ట్రాఫిక్ క్లియర్ చేస్తారు

**హైదరాబాద్‌లో ట్రాఫిక్ నివారణకు కీలక ముందడుగు - అందుబాటులోకి ట్రాఫిక్ మార్షల్స్ సహా అవెంజర్స్ బైక్స్ - కనుచూపు మేర ఎక్కడ ట్రాఫిక్ ఉన్నా క్షణాల్లో తొలగింపు**

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నిష్ణాతులైన ట్రాఫిక్ మార్షల్స్ సహా అవెంజర్స్ బైక్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. కనుచూపు మేర ఎక్కడ ట్రాఫిక్ ఉన్నా, క్షణాల్లో అక్కడకి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తారు. ఈ ట్రాఫిక్ పెట్రోలింగ్ బైకులను బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనర్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ జెండా ఊపి ప్రారంభించారు.అందుబాటులో 30 ట్రాఫిక్ పెట్రోలింగ్ బైకులు : హైదరాబాద్‌లో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేలా పోలీసులు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో కీలక ముందడుగు పడింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బ్రేక్ డౌన్ అయిన వాహనాలను గుర్తించి సత్వరమే తొలగించేందుకు వీలుగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సెల్ (హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఎన్‌సీసీ అర్బన్, వెకా, రత్నదీప్, కమల్ వాచ్ కంపెనీ, బృహస్పతి టెక్నాలజీస్ సహకారంతో రూ.కోటి 60 లక్షలతో చేసిన 30 ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న 45 మంది ట్రాఫిక్ మార్షల్స్‌కు సీపీ సజ్జనర్ ధ్రువపత్రాలు అందజేశారు. సామాజిక బాధ్యత కింద ఆర్థిక సాయం అందించిన కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ట్రాఫిక్ మార్షల్స్ కీలకం : హైదరాబాద్‌లో ట్రాఫిక్ బావుంటే అంతా బాగున్నట్లేనని సీపీ సజ్జనర్ తెలిపారు. ఎండనకా, వాననకా వాహనదారులు గమ్యం చేరేంత వరకు ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై ఉంటూ తోడ్పాటును అందిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతున్న ఘనత హెచ్‌సీఎస్‌సీకు దక్కుతుందని సజ్జనర్ వివరించారు."దాదాపు 50 వాహనాలను లాంఛ్ చేయడం జరిగింది.

## యువతి ప్రాణాలు తీసిన పీడకలలు! : అర్ధరాత్రి నగ్నంగా వీధుల్లో పరుగెత్తి - తెల్లారేసరికి శవమై తేలి

**ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని - పని ఒత్తిడిని తట్టుకోలేక ఇంటికే పరిమితం - అర్ధరాత్రి వీధుల్లోకి నగ్నంగా పరిగెత్తుకుంటూ వెళ్లి చెరువులో దూకి మృతి**





ఆమెకు చిన్న వయసులోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. జీతం రూ.లక్షల్లో ఉంది. జీవితం ఎంతో ఆనందంగా సాగిపోతోన్న తరుణంలో ఒక్కసారిగా అంతా మారిపోయింది. ఆఫీస్ విధుల్లో పని ఒత్తిడి భరించలేకపోయింది. ఇక ఇంటికే పరిమితమైంది. అకస్మాత్తుగా అర్ధరాత్రి వీధుల్లోకి నగ్నంగా పరిగెత్తుకుంటూ వెళ్లింది. మధ్యలో ఒక ఆలయం వద్ద మొక్కింది. అక్కడి నుంచి అలాగే పరిగెత్తుకుంటూ వెళ్లి, చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన హైదరాబాద్‌లోని మేడిపల్లిలో వెలుగు చూసింది.అర్ధరాత్రి నగ్నంగా పరుగెత్తి : పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా దేవపల్లికి చెందిన వక్కులగడ్డి ఈశ్వర్ రావు, అరుణ దంపతుల కుమార్తె తేజస్విని (25). ఈమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసేది. విధుల్లో తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేక ఆరు నెలల క్రితం ఉద్యోగం మానేసి విశాఖపట్నం వెళ్లిపోయింది. రెండు నెలల క్రితం తల్లి అరుణతో కలిసి హైదరాబాద్‌కు వచ్చింది. పీర్జాధిగూడలోని శంకర్‌నగర్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. ఆమె తండ్రి విశాఖపట్నంలోనే ఉంటున్నారు.అయితే పీర్జాధిగూడ నుంచి ఖాళీ చేసి మరో చోట గదిని అద్దెకు తీసుకోవడానికి తల్లి అరుణ, తేజస్విని కలిసి శుక్రవారం సాయంత్రం వరకు మియాపూర్‌లో రూమ్ కోసం వెతికారు. రాత్రి తిరిగి పీర్జాధిగూడకు వచ్చి పడుకున్నారు. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో తేజస్విని నిద్రలేచి తల్లి ఉండే గదికి బయటి నుంచి తాళం వేసింది. ఆ తర్వాత చేతిలో చీర పట్టుకుని నగ్నంగా వీధుల్లోకి పరుగెత్తింది.చెరువులో పడి బలవన్మరణం : మార్గం మధ్యలో స్థానిక బీరప్ప గుడి దగ్గర ఆగి మొక్కింది. మళ్లీ నగ్నంగానే పరిగెడుతూ పీర్జాధిగూడలోని చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. తల్లి ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇంటి తలుపులకు తాళం వేసినట్లు గుర్తించింది. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి తలుపులు తీశారు. తేజస్విని కోసం వెతకగా చెరువులో పడి చనిపోయి కనిపించింది.ఆత్మహత్య చేసుకున్న తేజస్విని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో తేజస్విని మృతదేహాన్ని బయటకు తీసి, గాంధీ ఆసుపత్రికి తరలించారు. తమ కుమార్తె తరచుగా పీడకలలు వస్తున్నాయని చెప్పేదని, మానసిక సమస్యలతోనే ఆత్మహత్య చేసుకుందని తల్లి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. మృతురాలు ఫియర్ ఫోబియాతో బాధపడేదని పోలీసుల విచారణలో తేలింది.ఆత్మహత్య పరిష్కారం కాదు : జీవితమన్నాక ఏదో ఒక సందర్భంలో సమస్యలు ఎదురవడం సాధారణమని, వాటికి తగిన విధంగా ఆలోచిస్తే పరిష్కార మార్గాలు దొరుకుతాయని నిపుణులు చెబుతున్నారు. మీకు ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు వచ్చినా, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నా, మీ సమస్యను ఇతరులతో పంచుకోవాలని భావిస్తున్నా, మీకు సహకరించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్లు సిద్ధంగా ఉన్నాయి. అందుకోసం స్నేహ ఫౌండేషన్ - 04424640050 (24x7 అందుబాటులో ఉంటుంది) లేదా టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హెల్ప్‌లైన్ - 9152987821కి సంప్రదించవచ్చు. వీరు ఆదివారం మినహాయించి సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటారు. వారిని సంప్రదించి మీ సమస్యలను వివరించవచ్చు. తద్వారా తగిన పరిష్కార మార్గాలను పొందవచ్చు.

## క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు చరిత్రను చెప్పేస్తుంది - ఏపీలో టూరిజానికి సరికొత్త అనుభవం!

**పర్యాటకుల కోసం ఏపీలో ఏఐ సేవలు - మీ భాషలోనే చరిత్ర చెప్పడం విశేషం**




ఆలయాలు, కోటలు, బీచ్‌లు లేదా ప్రకృతి అందాల ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఈ ఆలయం ఎప్పుడు నిర్మించారు, ఇక్కడ ఇంకా ఏమేం చూడాలి వంటి సందేహాలకు ఇక గైడ్ కోసం వెతకాల్సిన అవసరం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సేవలకు శ్రీకారం చుట్టింది.పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌తో స్కాన్ చేస్తే, సందర్శకుడి భాషలోనే ఆ ప్రాంత చరిత్ర, విశేషాలు, దర్శన సమయాలు, సమీప పర్యాటక ప్రదేశాల వివరాలు, ప్రయాణ సూచనలు అందుబాటులోకి వస్తాయి. ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం కూడా ఉండదు. రాష్ట్ర పర్యాటకశాఖ ప్రపంచవ్యాప్తంగా ట్రావెల్ టెక్నాలజీ రంగంలో సేవలు అందించడానికి ఒప్పందం చేసుకున్న ఎక్స్‌ప్లర్జర్‌కు 75 దేశాల్లో 2.2 కోట్లకుపైగా వినియోగదారులు ఉన్నారు. 130కు పైగా భాషల్లో సేవలు అందించే ఈ వేదిక గూగుల్ ఇంక్యుబేషన్ మద్దతుతో అభివృద్ధి చెందింది. అయితే సంస్థతో కలిసి 'నివ ఏఐ--న్యూరల్ ఇంటెలిజెన్స్ వెర్నాక్యులర్ యూనిఫైడ్ మోడల్'ను అమలు చేయనుంది. ఈ వ్యవస్థ ద్వారా 113 భాషల్లో సమాచారం అందుబాటులో ఉండటంతో దేశీయ, విదేశీ పర్యాటకులకు మరింత సౌకర్యం కలగనుంది.టూర్ ప్లాన్ కూడా సిద్ధం : ఈ ఏఐ వ్యవస్థ ప్రత్యేకత ఏమిటంటే అందరికీ ఒకే విధమైన సమాచారం ఇవ్వదు. చిన్నారులకు సులభమైన భాషలో, చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి విస్తృత వివరాలతో, ఆధ్యాత్మిక యాత్రికులకు స్థల పురాణాలు, దర్శన విశేషాలు, విదేశీ పర్యాటకులకు వారి మాతృభాషలో సమాచారాన్ని అందిస్తుంది. ఆలయాలైతే స్థల పురాణం, దర్శన సమయాలు, సమీప దేవాలయాల వివరాలు, కోటలు, బీచ్‌లు, ప్రకృతి ప్రాంతాలైతే వాటి చరిత్రతో పాటు ఒకటి లేదా రెండు రోజుల పర్యటన ప్రణాళికలను కూడా సూచిస్తుంది. ప్రయోగాత్మకంగా మంగళగిరిలోని ఎగువ, దిగువ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ఈ సేవలను ప్రారంభించి, అనంతరం రాష్ట్రంలోని 100కుపైగా పర్యాటక ప్రాంతాలకు విస్తరించనున్నారు.దీని వల్ల ప్రయోజనాలు : ఇక పర్యాటకులకు గైడ్ కోసం వెతుక్కోవలసిన అవసరం ఉండదు. భాష తెలియక ఇబ్బంది పడాల్సిన అవసరం కూడా లేదు. మొబైల్‌లోనే పూర్తి సమాచారం లభిస్తుంది. సమీపంలోని పర్యాటక ప్రాంతాల వివరాలు కూడా తెలుస్తాయి. మరోవైపు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) వెబ్‌సైట్‌ను కూడా ఆధునికీకరించి పర్యాటక ప్రాంతాలు, ప్యాకేజీలు, వసతి, ఇతర సేవల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. విమానాశ్రయాల్లోనూ వివిధ భాషల్లో బ్రోచర్లు అందుబాటులో ఉంచుతూ, సాంకేతికతతో పర్యాటక రంగాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

## పార్లమెంట్ సమావేశాలపై పార్టీ ఎంపీలకు జనసేనాని పవన్ దిశానిర్దేశం

**పార్లమెంటు చర్చల్లో దేశం ముఖ్యమన్న భావన కనిపించాలి - రాష్ట్ర ప్రయోజనాల సాధనకు కృషి చేయాలని పవన్ సూచన**



పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ ఎంపీలతో సమావేశమై కీలక దిశానిర్దేశం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటూనే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో సమర్థంగా గళం వినిపించాలని ఎంపీలకు సూచించారు. 'నేషన్ ఫస్ట్' అనే భావన ప్రతి చర్చలో ప్రతిఫలించాలని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన అంశాలను బలంగా ప్రస్తావించాలని ఎంపీలకు ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జనసేన ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, లింగమనేని రమేశ్ పాల్గొన్నారు. 'రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ప్రతి అంశంపైనా పార్టీ తరఫున గళం వినిపించాలి' అని పవన్ అన్నారు. రాష్ట్రానికి మేలు చేసే ప్రతి అంశంపై నిర్మాణాత్మక చర్చలు జరపడంతో పాటు కేంద్ర కేంద్రం నుంచి ఏపీకి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ సూచించారు. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రాజెక్టులకు అదనపు నిధులు సాధించేందుకు కేంద్రాన్ని సమర్థవంతంగా ఒప్పించే ప్రయత్నాలు చేయాలని ఎంపీలకు సూచించారు. ప్రతి అంశంపై నిర్మాణాత్మకంగా చర్చించాలని ఆయన సూచించారు.రైల్వే ప్రాజెక్టులు, కీలక బిల్లులపై వ్యూహం : సమావేశంలో రాష్ట్ర రైల్వే అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు పొందడం, అవసరమైన నిధుల కేటాయింపును సాధించడం, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్వోబీలు) ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ అభివృద్ధి వంటి అంశాలను పార్లమెంట్‌లో ప్రాధాన్యంగా ప్రస్తావించాలని పార్టీ ఎంపీలకు పవన్ కల్యాణ్ సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాల్లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన కీలక బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో, వాటిపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహాన్ని ఎంపీలకు వివరించారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజా ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి, జాతీయ ప్రయోజనాల దృష్టితో పరిశీలించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ ఎంపీలకు సూచించారు.


## ఆరు వరుసలతో సొరంగాలు చాలు - అమరావతి మళ్లీ కోత

**అమరావతి ఓఆర్ఆర్‌లో మరో కోత - 8 వరుసలొద్దు, 6 వరుసలతో సొరంగాలు చాలంటున్న ఎన్‌హెచ్ఏఐ ప్రతిపాదనలు మార్చాలని ఎన్‌హెచ్ఏఐ ఆదేశాలు - నిర్మాణ వ్యయం తగ్గింపే కానీ భవిష్యత్ అవసరాలు పట్టని వైనం**



అమరావతి ప్రాంతానికి కీలకం కానున్న అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) డీపీఆర్‌లో మరో కోత విధించారు. ఎనిమిది లైన్ల రహదారి నిర్మాణానికి వీలుగా సొరంగాలు నిర్మించేలా ప్రతిపాదనలు పంపిచగా ఆరు వరుసల రహదారికే వాటిని పరిమితం చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఐ) నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఎన్‌హెచ్ఐ అధికారులు ప్రతిపాదనల్లో మార్పులు చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ఓఆర్ఆర్ విస్తరించాలంటే సొరంగాలను విస్తరించడం సాధ్యం కాదని తెలిసినా దీనిని పరిగణనలోకి తీసుకోవడం లేదు.అమరావతి ఓఆర్ఆర్‌లో మరో కోత అమరావతి ఓఆర్ఆర్‌ను 189.4 కిలోమీటర్ల మేర 6 వరుసలుగా నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం గంగినేని వద్ద అటవీ ప్రాంతంలో 2.78 కిలోమీటర్లు 1.69 కిలోమీటర్లలతో, గుంటూరు జిల్లా పేరేచెర్ల అటవీ ప్రాంతంలో 0.51 కిలోమీటర్లతో కలిపి మొత్తం 4.98 కిలోమీటర్ల మేర మూడు సొరంగాలు నిర్మించనున్నారు. ఒక్కో చోట వెళ్లే వాహనాలకు ఒకటి, వచ్చే వాహనాలకు మరొకటి చొప్పున ఈ సొరంగాలు ఉంటాయి. వీటిలో ఒకవైపు నాలుగు, మరోవైపు మరో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి వీలుగా మొత్తం 8 లైన్ల రహదారి ఉండేలా సొరంగాలు ఉండాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఓఆర్ఆర్ ప్రస్తుతం 6 వరుసలతో నిర్మించనున్నారు. భవిష్యత్‌లో 8 వరుసలుగా విస్తరించినా ఇబ్బంది లేకుండా సొరంగాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అయితే 8 లైన్ల రహదారులు నిర్మించేలా సొరంగాలు అవసరం లేదని, ఆరు వరుసల రహదారులకు అనుగుణంగా తవ్వితే చాలంటూ ఎన్‌హెచ్ఐ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.గతంలో పంపిన ప్రతిపాదనల్లో మార్పులు చేసి పంపాలని కోరారు. ఇలా చేస్తే ఓఆర్ఆర్‌ను 6 లైన్ల నుంచి 8 వరుసలుగా విస్తరించాలంటే మూడు టన్నెల్స్ వద్ద సాధ్యం కాదు. కొత్త టన్నెల్స్ నిర్మాణ ఖర్చు ఎక్కువవుతుంది. అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా ప్రాజెక్ట్ వ్యయం తగ్గింపే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.ఓఆర్ఆర్‌కు తొలుత రూ.38,450 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత ఇందులో తెనాలి సమీపంలో ఓఆర్ఆర్ నుంచి చెన్నై- కోల్‌కతా హైవేలో కాజ వద్దకు చేరుకునేలా ఆరు లైన్లతో 17.5 కిలోమీటర్లు నిర్మించాలనుకున్న అనుసంధాన రహదారి - స్పర్ రోడ్ ప్రతిపాదనను తొలగించారు. ఓఆర్ఆర్‌కు ఇరువైపులా రెండేసి వరుసలతో సర్వీస్ రోడ్లు నిర్మించేలా ప్రతిపాదిస్తే ఇందులో బయటి వైపు సర్వీస్ రోడ్‌ను తొలగించి, లోపలి వైపు సర్వీస్ రోడ్‌కే సమ్మతించారు. ఇలాంటి కోతలతో ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ.32,000ల కోట్లకు తగ్గించారు.

# వైరస్‌లు క్యాన్సర్ కారకాలు



శరీరంలో ఏదైనా భాగంలో కణాల పెరుగుదల అదుపులేకుండా పెరిగి ఇతర భాగాలకు వ్యాపించడాన్ని క్యాన్సర్‌గా పేర్కొంటారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ప్రజల అనారోగ్యానికి, మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారణంగా ఉంటున్నది. ఇప్పుడు ఇతర కారకాలతోపాటు వైరస్‌లు కూడా కొన్ని రకాల క్యాన్సర్లను కలగజేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నట్టు ఆరోగ్య రంగ నిపుణులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైరస్‌లు క్యాన్సర్‌ను ఎలా కలగజేస్తాయి, వాటిని నిరోధించడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో అవగాహన ఉండాలి. ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే అతి సూక్ష్మ అంటురోగాల కారకాలే వైరస్‌లు. ఇవి బయటి వాతావరణంలో నిర్జీవులుగా ఉంటాయి. ఒకసారి జీవిలో ప్రవేశించాయంటే ఆ జీవి కణాల్లో అభివృద్ధి చెందుతూ జీవ లక్షణాలను ప్రదర్శిస్తాయి. అయితే, కొన్ని రకాల వైరస్‌లు అవి ఆశ్రయించిన (హోస్ట్) జీవి కణాల పనితీరులో కలిసిపోయేలా మార్పుచెందుతాయి. దీనివల్ల కణాల సాధారణ విధుల్లో అవాంతరాలు ఏర్పడతాయి. ఇలాంటి వాటిలో 'ఆంకోజెనిక్' లేదా 'ట్యూమర్ వైరస్‌లు'గా పిలిచే అనేక వైరస్‌లు మనుషుల శరీరంలో క్యాన్సర్ అభివృద్ధికి కారణంగా ఉంటాయి. వీటిలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వైరస్‌లు (హెచ్‌బీవీ, హెచ్‌సీవీ), లాలాజలం, ఇతర శరీర ఫ్లూయిడ్ల ద్వారా వ్యాపించే 'ఎప్‌స్టీన్ బార్ వైరస్' (ఈబీవీ), హ్యూమన్ ఇమ్యునో డెఫీషియెన్సీ వైరస్ (హెచ్ఐవీ) లాంటివి ప్రసిద్ధి చెందిన క్యాన్సర్ కారక (ఆంకోజెనిక్) వైరస్‌లుగా ఉన్నాయి. ఈ వైరస్‌లు క్యాన్సర్‌కు దారితీసే మార్గాలు వేర్వేరుగా ఉంటాయి. కాకపోతే అవి వ్యాపించే విధానం మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. ఉదాహరణకు, హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఆంకోప్రొటీన్లను ఉత్పత్తి చేస్తుంది. ఇది కణం పనితీరు సాఫీగా సాగిపోయే ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంది. నియంత్రణ లేకుండా కణాలు పెరిగిపోయే క్రమాన్ని ప్రోత్సహిస్తుంది. చివరికి ప్రాణాంతకమైన క్యాన్సర్ అభివృద్ధి చెందడానికి దారితీస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి, సి వైరస్‌లు కూడా దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతాయి. హెపటో సెల్యులర్ కార్సినోమా అనే క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును పెంచుతాయి. రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్న వ్యక్తులలో, హెచ్ఐవీ సోకిన వారిలో వైరస్ సంబంధిత క్యాన్సర్లు అభివృద్ధి చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

**రోగాల భారం...**

ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో క్యాన్సర్ ముప్పు వైరల్ ఇన్ఫెక్షన్లతో ముడిపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అంచనాల ప్రకారం సంవత్సరానికి ఇరవై లక్షలకుపైగా క్యాన్సర్ కేసులు క్యాన్సర్ కారక వైరస్‌లతో (ఆంకోజెనిక్ వైరస్‌లు) సంబంధం కలిగి ఉన్నాయి. దాదాపు 90 శాతం గర్భాశయ క్యాన్సర్లకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), కాలేయ క్యాన్సర్లలో ఎక్కువ భాగం హెపటైటిస్ బి (హెచ్‌బీవీ), హెపటైటిస్ సి (హెచ్‌సీవీ)లు కారణం అవుతున్నాయి. అయితే, వైరస్ ఇన్ఫెక్షన్లు, వాటి కారణంగా క్యాన్సర్లు రాకుండా నివారించడంలో ప్రభుత్వాలు చేపట్టే ప్రజా ఆరోగ్య కార్యక్రమాలే కీలకపాత్ర పోషిస్తాయి.

**నివారణకు బహుళ నమూనా...**

వైరస్‌ల వల్ల అభివృద్ధి చెందే క్యాన్సర్లను నిరోధించడానికి ఆయా రకాల వైరస్‌ల వ్యాప్తిని తగ్గించడం, టీకాలు వేయడం, ముందుగానే స్క్రీనింగ్ పరీక్షలు చేయడం, ఇన్ఫెక్షన్లకు తగిన చికిత్స అందించడం వంటి బహుళ నమూనా (మల్టీ మోడల్) విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.

**టీకాలు (వ్యాక్సినేషన్)...**

క్యాన్సర్ నివారణలో టీకాలు ప్రభావవంతంగా పనిచేస్తాయని రుజువైంది. మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ క్యాన్సర్‌పై పోరాటానికి హెచ్‌పీవీ టీకా సమర్థంగా పనిచేస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి వైరస్‌తో వ్యాపించే కాలేయ క్యాన్సర్ ప్రాబల్యాన్ని తగ్గించడంలో హెపటైటిస్ బి టీకాలు ప్రభావవంతమైన పరిష్కారంగా చెప్పొచ్చు. ప్రజారోగ్య ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా చిన్న వయసులోనే అవసరమైన టీకాలు వేయించుకోవడం, అధిక టీకా రేట్లు నమోదు కావడానికి ప్రభుత్వాలు కృషిచేయాలి.

**స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు...**

గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్‌లు పాప్ స్మియర్ టెస్ట్, హెచ్‌పీవీ పరీక్షలు చేయించుకోవడం వంటివి వైరస్‌లతో వచ్చే క్యాన్సర్లను ముందుగా గుర్తించేందుకు ఉపకరిస్తాయి. ముఖ్యంగా ముప్పు ఎక్కువగా ఉన్న వారి విషయంలో క్యాన్సర్ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. చికిత్సను సులభతరం చేస్తాయి.

**యాంటీవైరల్ థెరపీ...**

హెపటైటిస్ బి వైరస్, హెపటైటిస్ సి వైరస్ వంటి దీర్ఘకాలిక వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీవైరల్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటితో వైరస్ స్థాయిలను సమర్థంగా తగ్గించుకోవచ్చు. ఆ విధంగా క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును కూడా తగ్గించవచ్చు. హెపటైటిస్ సి చికిత్సలో ప్రత్యక్షంగా పనిచేసే డైరెక్ట్ యాక్టింగ్ యాంటీవైరల్ ఏజెంట్ల పురోగతి పూర్తి వైరస్ నిర్మూలనకు, క్యాన్సర్ తగ్గడానికి అవకాశం ఇస్తుంది.

**ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు...**


వైరస్‌లు, కాన్సర్ల మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలకు తెలియజేయడంలో అవగాహన కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయి. అంటువ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయి, టీకాల ప్రాముఖ్యం, వ్యాధుల బారినపడటాన్ని తగ్గించడానికి సురక్షిత చర్యలు తీసుకోవడం వంటివి ఈ వ్యాధుల ప్రభావాన్ని బాగా తగ్గిస్తాయి. వ్యాధి నిరోధకత పెంపు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఇన్ఫెక్షన్లు సులభంగా సోకుతాయి. కాబట్టి ఇమ్యూనిటీ బలహీనంగా ఉన్నవాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా హెచ్ఐవీ, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ ఉన్న సమూహాలు ఎదుర్కొనే ముప్పును తగ్గించడానికి తగిన టీకా కార్యక్రమాలు, స్క్రీనింగ్ చర్యలు దోహదపడతాయి. వైరస్‌లు సాధారణ జలుబు మొదలుకుని క్యాన్సర్ల వ్యాప్తి వరకు ఎన్నో ఆరోగ్య సమస్యలకు కారకాలుగా ఉంటాయి. ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోవడానికి వివిధ రంగాల నుంచి సమష్టి కృషి అవసరమవుతుంది. వైరస్ ప్రేరిత, వైరస్ సంబంధిత క్యాన్సర్లను నివారించడంలో టీకాలు, స్క్రీనింగ్, యాంటీవైరల్ థెరపీలు కీలకమైన అంశాలు. ఈ రక్షణ చర్యలపై ప్రభుత్వాలు, ఆరోగ్య రంగ సంస్థలు దృష్టి సారించడం ద్వారా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. ప్రాణాలను నిలబెట్టుకోవచ్చు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య పరిస్థితులను కూడా మెరుగుపర్చుకోవచ్చు. అయితే, వైరస్‌లు, క్యాన్సర్ల మధ్య పరస్పర చర్యలపై అంతర్జాతీయంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. కాబట్టి, క్యాన్సర్లను నివారించే దిశగా ఔషధాలు, చికిత్సలు అభివృద్ధి చేసే దిశగా నిరంతర అధ్యయనం, కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

# గుండెల్ని పిండే కాలుష్యం



భారతీయ నగరాల్లో పెరిగిపోతున్న వాయు కాలుష్యం వల్ల గుండెజబ్బులున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వస్తున్నది. వాయుకాలుష్యం ఇతరులకంటే గుండె జబ్బులున్నవారికి మరింత ప్రాణాంతకమని అమెరికా పరిశోధకులు గుర్తించారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంస్థలతో కలిసి ఇంటర్‌మౌంటెన్ హెల్త్ సంస్థకు చెందిన పరిశోధకులు వాయు కాలుష్యం వల్ల ఆరోగ్య దుష్ప్రభావాలపై అధ్యయనం నిర్వహించారు. క్యూబిక్ మీటర్ గాలిలో 7 నుంచి 20 మైక్రోగ్రాముల కాలుష్య కారకాలు ఉన్న ఢిల్లీ మరికొన్ని నగరాల్లో ఈ అధ్యయనం నిర్వహించారు. గాలి కాలుష్యం 2.5 పీఎం స్థాయిలో ఉన్న ప్రాంతాల్లోని సాధారణ ప్రజలు, గుండె జబ్బుతో బాధపడే వారి నుంచి రక్త నమూనాలను సేకరించి అధ్యయనం చేశారు. వాయు కాలుష్యం వల్ల గుండె జబ్బు బాధితుల రక్త నమూనాల్లో అనేక అనారోగ్యకారకమైన మార్పులు గుర్తించారు. గుండె జబ్బులు ఉన్నవాళ్ల రక్త నమూనాల్లో ఇన్‌ఫ్లమేటరీ బయోమేకర్స్ (%జజూ27, ×ూ%-18) చాలా ఎక్కువగా ఉన్నాయని తేలింది. గుండె జబ్బులు లేనివాళ్లలో ఏ మార్పూ కనిపించలేదు. హృద్రోగులు వాయు కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం చెబుతున్నది. ఎంత జాగ్రత్తగా ఉంటే గుండెకు అంత మంచిది.

# కాళన్న స్ఫూర్తి ఎక్కడ?



'పాలనాధికారం దుర్వినియోగం చేసే/ గుండాలకు నేను ద్రోహినే/ అన్యాయాన్నెదిరించడం/ నా జన్మహక్కు నా విధి' అన్న కాళోజీని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వారసత్వాన్ని చాటే నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలకూ, ప్రాజెక్టులకు ఇంకా మరెన్నింటికో తెలంగాణ కీర్తి పతాకలు, స్ఫూర్తి ప్రతీకలుగా నిలిచిన మహానుభావుల పేర్లు పెట్టారు. కుమ్రంభీం, జయశంకర్‌సార్, కాళోజీ వంటి తెలంగాణ పోరాట పటిమకు, తెగువకు మారుపేరైన మహోన్నతుల పేర్లను నిత్య స్మరణీయాలుగా మార్చి నిజమైన నివాళి ఘటించారు. ఆ కోవలో రూపుదిద్దుకున్నదే వరంగల్‌లోని కాళో జీ కళాక్షేత్రం. ఏకశిలా నగరానికి సిగలో పువ్వులా సువిశాలమైన ప్రాంగణంలో మహా సభావేదిక నిర్మాణానికి కేసీఆర్ ప్రణాళికలు వేశారు. ఆ ప్రాంగణంలోనే కాళన్న నిలువెత్తు విగ్రహం చేయించారు. ప్రారంభోత్సవమే తరువాయి అన్న తరుణంలో సర్కారు మారింది. దాదాపుగా పూర్తయిన భవనానికి రంగులు, సున్నాలు వేసి అట్టహాసాలు చేస్తున్నది రేవంత్ ప్రభుత్వం. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండానే ఇదివరక టి సర్కార్ పూర్తిచేసిన రిక్రూట్‌మెంట్‌తో నియామక పత్రాల పంపిణీ పేరిట హంగామా చేసి పేరు కొట్టేయాలని చూసినవాళ్ల నుంచి ఇంతకంటే ఏం ఆశించగలం? ఇంతకూ కాళోజీ పేరుతో ప్రచారం పొందాలని చూస్తున్న కాంగ్రెస్ పాలకుల్లో ఆయన స్ఫూర్తి కించిత్తు అయినా ఉన్నదా అనేది అసలు ప్రశ్న. ఏడాది కావస్తున్నా ఒక్కటంటే ఒక్కటి ప్రజానుకూల నిర్ణయం తీసుకున్నారా? ఒక్క మంచిపనికి శ్రీకారం చుట్టారా? అంతదాకా ఎందుకు, ఏ అస్తిత్వం కోసం కాళోజీ లాంటి మహానుభావులు కొట్లాడారో దానినైనా కాపాడుతున్నారా? తెలంగా ణ పొడే గిట్టని పరాయి పాలకుల ముందు మోకరిల్లుతున్నారు. నీటి హక్కులను కాటగలుపుతున్నారు. ఇదంతా చాలదన్నట్టుగా ఆనవాళ్లు చెరిపేస్తామని ఎగిరెగిరి పడుతున్నారు. కాళోజీ కళాక్షేత్రం కేసీఆర్ ఆనవాళ్లలో ఒకటి కాదా? ఆ మాటకు వస్తే తెలంగాణే కేసీఆర్ అతిపెద్ద ఆనవాలుగా చరిత్రలో నిలిచిపోయింది. చెరిపేస్తే చెరిగిపోవడానికి అది నీటిమీది రాతకాదు, సువర్ణాక్షరం. ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోయే చేతగాని, అనుభవం లేని పాలకు లు రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నరు. ప్రజాపాలన అంటూ ప్రజాకంట క పాలన తెచ్చారు. ప్రశ్నిస్తే కేసులు అరెస్టులంటూ వేధిస్తూ పోలీసు రాజ్యం చెలాయిస్తున్నారు. కాళోజీ బ్రతికి ఉంటే ఇవన్నీ సహించేవా రా? 'దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరం దాకా తన్ని తరుముతం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర పెడతం' అని గర్జించాడు కదా. అంతేకాదు, తన పేరిట నిర్మించిన ప్రాంగణంలోనే పోలీ సు జులుం ప్రదర్శిస్తే ఊరుకునేవారా? 'హింస పాపమని యెంచు దేశమున హిట్లరత్వమింకెన్నాళ్లు?' అని ప్రశ్నించిన కాళోజీ నేడు రాష్ట్రాన్నే జైలుగా మార్చి ఎమర్జెన్సీ తరహా పాలన తెస్తే పోనీలే అని సరిపెట్టుకునేవారా? 'మరిచిపోకుండగ గురుతుంచుకోవాలె.. కాలంబు రాగానె కాటేసి తీరాలె' అని కాళన్న చెప్పింది ఈ తరహా పాలకుల గురించే అన్నది గుర్తుంచుకోవాలి.

# నిజం చెప్పకుంటే అబద్ధమే రాజ్యమేలుతుంది



పోరాటాల గడ్డ మన వరంగల్ ఖిల్లా. తెలంగాణ ఉద్యమ నాదాన్ని శిరస్సుపై మోసి భారతదేశానికి ప్రత్యేక రాష్ట్ర వాంఛను పరిచయం చేసింది మన వరంగల్ జిల్లానే. కాకతీయ రాజులు, సమ్మక్క-సారక్కలు అందించిన వారసత్వంతో%ూ% దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ పౌరుషత్వంతో పిడికిలి బిగించి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషించిన వరంగల్ జిల్లా ప్రజానీకానికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. నిన్న వరంగల్ జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు పొందేందుకు గాను వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యలకు మనందరం సమాధానం చెప్పకపోతే అన్యాయమే రాజ్యమేలుతుంది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నేలా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ధిక్కార స్వర నినాదంతోటే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పడం లో ఎలాంటి సందేహం లేదు. ప్రజల ఐక్యతతో అందిపుచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం మరింత ప్రజ్వరిల్లాలని మన వరంగల్ ప్రత్యేక భూమిక పోషించింది. అందులో భాగంగానే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలతో త్రినగరాన్ని సుందరీకరించుకున్నాం. ఎన్నో అంతర్జాతీయ పరిశ్రమలను వరంగల్ జిల్లాకు తీసుకువచ్చి, వరంగల్ ఖ్యాతిని ఖండాంతరాలకు పరిచయం చేసిన నేత కేసీఆర్. కానీ, కొందరు మిడిమిడి జ్ఞానంతో వాస్తవాలను, అవాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, చరిత్ర చెరిగిపోదు కదా? కాకతీయ రాజుల చరిత్రను తిరగరాసేలా.. ముందు తరాలకు భవిష్యత్తు రహదారిని పరిచేందుకు గాను కేసీఆర్ 'మిషన్ కాకతీయ' పేరుతో ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టి రేగుముళ్లతో ఉన్న పొలాలను పచ్చని మాగాణిగా మలిచారు. నాడు ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ నారాయణరావు ను అణచివేయాలని, రాజకీయంగా ఎదగనీయకుండా చేయాలని శతవిధాలుగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. అయితే ఆ పార్టీ నేడు నీతులు మాట్లాడుతుండటం నీచమైన రాజకీయ చర్యగా భావిస్తున్నా. కాళోజీ నామస్మరణ చేసే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం లేదు. నాడు వ్యతిరేకించిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు భజనలు చేయడం చూస్తుంటే 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టుగా ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కాళో జీ నారాయణరావుకు ప్రత్యేక గుర్తింపు ఉండాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ నేతృత్వంలోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగ ల్ జిల్లా ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఆ సమావేశంలో కాళోజీ కళాక్షేత్ర నిర్మాణానికి పూనుకోవాలని తీర్మానం చేశారు. అనుకున్నదే తడవుగా ప్రత్యేక జీవో ద్వారా నిధులను విడుదల చేసి నిర్మాణ పనుల ను వేగవంతం చేశారు. ఈ క్రమంలో కరోనా మహమ్మారి కారణంగా నిర్మాణ పనులు కొం చెం ఆలస్యమయ్యాయి. కానీ, కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పుడు చంకలు గుద్దుతూ మేమేదో చేశామన్నట్టు ఊకదంపుడు రాతలతో నిజాలను అబద్ధాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నది. చెరిపేస్తే చరిత్ర చెరిగిపోతుందా? నిజానిజాలేమిటో ప్రజలకూ తెలుసు. రాష్ట్రవ్యాప్తంగా చూసుకున్నట్టయితే వెలుగులు విరజిమ్మేలా.. కండ్లు మైమరిచేలా దశాబ్ద కాలంలో జరిగిన అభివృద్ధే తప్ప.. రాష్ట్రంలో గత ఏడాది కాలం గా జరిగిన అభివృద్ధి శూన్యం అనేది నూటికి నూరుపాళ్లు నిజం. నాటి ప్రభుత్వ ప్రగతి చక్రాలతో వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్యం, పర్యాటకం, సాంస్కృతిక, ఉపాధి అన్నిరంగా ల్లో కేసీఆర్ తనదైన ప్రత్యేక చొరవను చూపించారు. ఒక్క వరంగల్ జిల్లానే కాదు, రాష్ట్రం మొత్తం అభివృద్ధి పథంలో దూసుకుపోయిం ది. కానీ, నేడు రాష్ట్రంలో చీకట్లు అలుముకున్నాయి. దశాబ్ద కాలపు అభివృద్ధిపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చా క పచ్చగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా తీరు మారింది. ఇది నేనొక్కదాన్నే చెప్తున్న వాస్తవం కాదు, రాష్ట్ర పరిస్థితిని చూసిన ప్రజలందరూ ముక్తకంఠంతో ఘోషిస్తున్నది. రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ జిల్లాకు ప్రాణం పోసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం. హైదరాబాద్ అభివృద్ధికి ఏ మాత్రం తీసిపోకుండా వరంగల్‌కు అంతే ప్రాధాన్యం కల్పించింది తెలంగాణ తొలి ప్రభుత్వం. అభివృద్ధికి చిరునామాగా మారుస్తూ జాతీయ కంపెనీ మెగా టెక్స్‌టైల్ పార్కును సైతం తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిది. అభివృద్ధి పథాన దూసుకువెళ్తున్న తెలంగాణను అణగదొక్కాలని నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాడు ఆంధ్రా తొత్తులతో కలిసి కుట్రలు చేసిన విషయం తెలంగాణలోని ప్రతీ పౌరునికి తెలుసు. ఆ కుట్రలను ఛేదించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రత్యేక ఖ్యాతిని గడించి యావత్ ప్రపంచాన్ని మనవైపు తిప్పుకునేలా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. నిరంత రం అభివృద్ధి మంత్రంతో, సంక్షేమ పథకాల తో, ప్రజారంజకమైన పరిపాలనను అంది స్తూ.. సబ్బండ వర్గాలను గుండెకు హత్తుకున్న చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఈ ప్రాంత బిడ్డ పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలతో దేశానికి వన్నె తెస్తే, ఢిల్లీలో తన చితికి కట్టెపుల్ల కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీ పీవీ గురించి మాట్లాడటం మరీ విడ్డూరం. జాతీయ రహదారులకు, తెలంగాణ రాష్ట్ర అంతర్గత రోడ్లను అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నే లా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభు త్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకొని అధిష్ఠానానికి చేరవేయడమే తప్ప అంతకుమించిందేమీ ఉండదు. తెలంగాణ రాష్ట్రం నలువైపులా మరింత అభివృద్ధి సాధించాలంటే అదొక్క బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని తెలుసుకో. మణిపూర్ లాంటి ఘటనలు రాష్ట్రంలో ఎన్నో చూస్తున్నాం. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదు. ఢిల్లీకి డబ్బు ల మూటలు అప్పజెప్పడంతోనే ఆ పార్టీకి సరిపోతున్నది. అధికార జులుంతో, పోలీసు బలగాలతో గిరిజన తండాలపై దాడులు చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. గిరిజనులు తమ భూములను అప్పనంగా అప్పజెప్పాలని రైతులకు సంకెళ్లతో బేడీ లు వేసి, అమాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన రాక్షస ప్రభుత్వం ఇది. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ పోలీసు బలగాలతో చేస్తు న్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో మిగిలిపోవడం ఖాయం.

# చారిత్రక విభాత సంధ్యల..కడపటి యుద్ధం

బండి నారాయణ స్వామి పదార్థ నియమాలను, భౌతిక పరిమితులను జయించిన సృజనకారుడు. ఇంకేముంది. అలవోకగా తన రెకలు ఆర్చుకొని, ఆ రెకల మీద మనలను (పాఠకులను) కూర్చుండబెట్టి, 16వ శతాబ్దంలోకి తిరోగమించి, విజయనగర సామ్రాజ్యపు రాచరిక వైభవాన్ని.. అకడి జన జాతుల సామూహిక జీవన విశిష్టతను సజీవ దృశ్యంగా కంట చూపారు.కడపటి యుద్ధం నవల అనటం కంటే..620పేజీల ఆదిహిందూ జనజాతుల చారిత్రక దృశ్యకావ్యం అనటం సమంజసం. వీరం, క్రోధం, మోహం, లోభం, శృంగారం, బీభత్సం, భయానక, అద్భుత రసాలు సమ్మిళితమై అద్వితీయమైన రసానుభూతిని కలిగిస్తుంది.రాచరిక చరిత్ర అంతా నెత్తుటి పొద్దుతోనే మొదలవుతుంది. నెత్తుట్లోనే పారాడి పారాడి నెత్తుటి చెమ్మతోనే ముగుస్తుంది. అట్లే.. నెత్తుటి పొద్దుతోనే కడపటి యుద్ధం తొలి పుట మొదలయ్యింది. ఏనుగు అంతటి అళియ రామరాయల వారి కథ నెత్తుటి ముద్దగానే ముగిసిపోతుంది. రాజులు.. కుట్రలు..కత్తులు.. నెత్తుర్లు.. కొత్తేమీ కాదు. కానీ నారాయణ స్వామి తనకే సొంతమైన అద్భుత కాల్పనిక శక్తితో ప్రతిపుటను దృశ్యాల దొంతరగా రూపొందించారు.మహాభారతంలో ఎన్నిరకాల మనస్తత్వాలు గోచరిస్తాయో .. కడపటి యుద్ధ కావ్యంలో అంతకు మించిన వ్యక్తిత్వాలు అనుభవంలోకి వచ్చాయి. హంపణ్ణ యక్షిణి- ప్రేమ సల్లాపం. అలివేలు- శ్రీనివాసరెడ్డి భగ్న ప్రేమ విలాపం.. ఉపపతితో తెలుగుల మాధవుడు రెండవ భార్య కలాపం.. దేవదాసీ రత్నమాల పొందు కోసం కత్తి పట్టిన టిట్టిభశెట్టి వీరత్వం.. బానిస మహిళ కోసం శెట్టి ఉబలాటం. ముస్లిం పాదుషాల మత మర్మం.. గోలొండ సామ్రాట్ ఇబ్రహీం కుతంత్రం.. అళియ రామరాయల వారి రాజసం.. రాజకీయం.. ముస్లిం సైనికుల మతతత్వం.. ఎన్నని చెప్పను నవల నిండా సజీవపాత్రలే. మహాభారత కావ్యం హస్తినాపురం చక్రవర్తులు, రాజులు, సామంతులు, రాణివాసాల పాత్రలకు.. రాచరికపు కొలువు కూటాల మంత్రాంగాలు, కుట్రలు, కుతంత్రాలు, ఎత్తులు, జిత్తులకే పరిమితమైంది. కానీ కడపటి యుద్ధం హంపి నగర రాజ సౌధాలను దాటుకొని పంచమవాడలోకి ప్రవేశించింది. అకడి నుండి తురకవాడకు..అట్లా ఏడు ప్రాకారాల నడుమనున్న ఒకో సామాజిక జన జాతుల సమూహాల జీవన పార్శ్వాన్ని తడిమి చూపించింది. అకలవాడన మద్యం తిత్తుల మైకం.. బానిస స్త్రీల వేలం.. భోగం సానులతో శృంగారం.. దేవదాసీ సౌధం.. అందలి గోడల మీద చిత్రకళా చాతుర్యం.. పోర్చుగీసు వారి వ్యాపారం.. ఎన్నని రాయను. ప్రతి పదసృష్టి ఒక అద్భుతమే. నవల ఆద్యంతం విసుగు, విరామం లేకుండా ఏకబిగిన చదివించింది."కవి కడు స్వతంత్రుడు. స్వతంత్ర వ్యక్తిత్వం వున్నవాడు. అందుకని వాస్తవికతను వాస్తవికతగా చెప్పడు. వాస్తవికతకు వ్యక్తిత్వంతో స్పందించి సృజించడమే కళ అని కవికి తెలుసు" అంటుంది భాగీరథి. ఈమె భోగం సాని కూతురు. అప్పటికి ఆమె గోలొండ యువరాజు ఇబ్రహీం ప్రేయసి. ఈ మాట ముమ్మాటికి ఈ నవల రచయిత బండి నారాయణస్వామి వ్యక్తిత్వమే. చారిత్రక వాస్తవానికి సృజన జోడించి నిష్కర్షగా, నిర్మొహమాటంగా ఎత్తి చూపారు. మతం అప్రజాస్వామికమైనది అని తేల్చి చెప్పారు. అయితే సామాజికంగా, సాంస్కృతికంగా సమాజంలో సమ్మిళితమై ఉన్న మతపార్శ్వాన్ని తృణీకరించలేని నగ్న సత్యాన్ని ప్రతిభావంతమైన పాత్రల ద్వారా ఎత్తిచూపారు.అనేక సజీవ పాత్రల నడుమ నా మనసుకు అద్భుతం.. అబ్బురం అనిపించిన అభినేతలు ఇద్దరు. ఒకరు ఉత్తణ్ణ. ఇంకొకరు నల్లజ్జ. పరస్పర విరుద్ధ స్వభావమున్న పాత్రలు. బండి నారాయణ స్వామి అద్భుత సృష్టికి ప్రతిరూపాలు. ఉత్తణ్ణ.. ఉత్తముడు.. పంచముడు..చర్మకారుడుడ నిర్వికారుడు.. జ్ఞాన సంపన్నుడు.. అన్నిటికీ మించి వీరవైష్ణవ భక్తి ఉద్యమకారుడు. ఈ పంచముని గుడిసెకు సాక్షాత్తు శ్రీరామ చంద్రుడే ఏతెంచి తన భక్తుడు హన్మంతునికి పాదరక్షలు కుట్టడం అనేది అనన్య సామాన్య కల్పన. పంచమున్ని అచంచలమైన దైవిక కొండ అంచున నిలబెట్టిన ప్రయత్నం. ఉత్తణ్ణ పాత్రలో నాకు సాక్షాత్తు బండి నారాయణ స్వామి గారు సాక్షాతరించారు. వారితో నాకు పరిచయ భాగ్యం బహు స్వల్పకాలమే కానీ, నిరాకారి వెర్రి తన్మయం ఏదో స్వామి గారి చుట్టూ ఆవహిస్తుంది అనిపించింది.ఇంకొకరు నల్లజ్జ. నిర్లజ్జకు నిలువెత్తు రూపం.వ్యసనపరుడు..బోగ లాలసుడు.. జ్ఞాన హీనుడు. మహిళా వస్తాదు చినపోతి భర్త. వేశ్య ప్రాపాలిక ఇష్ట ప్రియుడు. నల్లప్రజ నాయకుడు. నల్లప్రజ అంటే దొంగల దండు. యుద్ధానికి ముందు రాయలవారు శత్రు రాజ్య గ్రామాల మీద రాయలు ప్రయోగించే లూటీ ముఠా. నల్లజ్జ పాపభీతి, ప్రాణభయం లేని యోధుడు. ఈ మొండి తనమే ఆఖరి నిమిషంలో అతని ప్రాణం నిలిపింది.'అన్నమయ్య మన సంప్రదాయక ఆధ్యాత్మికతకు తన వ్యక్తిగత అనుభూతిని, అనుభవాన్ని జోడిస్తాడు. అతడు మొత్తం 89భిన్న స్వరరాగాలను ప్రయోగించి ఉంటారు' అని అళియ రామరాయల వారు తన ఇష్టసఖి తిరుమలాంబకు వచించిన సందర్భం.. అనంతరం పుణ్య దంపతుల మధ్య సాగిన సాహితీ సంభాషణ నారాయణ స్వామి గారి సాహిత్య జ్ఞానానికి ప్రతిరూపం. దేవుడు.. దెయ్యం.. మత విశ్వాసాలు లేని హంపణ్ణ ఆఖరికి దేవతా విగ్రహాలను రక్షించే బాధ్యతలు మోయటం కొసమెరుపు. హిందూ ఆలయాల విధ్వంసకుడు, ముస్లిం యుద్ధ వీరుడైన రెహమాన్ హంపణ్ణకు తోడు నిలబడటం కథలో మరో ట్విస్టు .గొప్ప చారిత్రక నవలకు జీవం పోసి నడిపించిన ఈ సాహితీ జ్ఞాని కృషి అపురూపం, అద్వితీయం అని చెప్పక తప్పదు.

## భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు గట్టి షాక్.. ఆరేళ్ల కనిష్ఠానికి అమ్మకాలు.. 'నథింగ్' మాత్రం దూసుకెళ్లింది!

**భారీగా పతనమైన భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్**

**కాంపోనెంట్ ధరల పెరుగుదలే ప్రధాన కారణం**

**అగ్రస్థానంలో నిలిచిన వివో.. వృద్ధి చూపిన శాంసంగ్**

**ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ దూసుకుపోయిన నథింగ్ బ్రాండ్**

**ఈ ఏడాది మొత్తం 13 శాతం క్షీణత ఉండొచ్చని అంచనా**



భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2026 రెండో త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు గత ఏడాదితో పోలిస్తే 10 శాతం క్షీణించాయి. గత ఆరేళ్లలో ఒక జూన్ త్రైమాసికంలో ఈ స్థాయిలో అమ్మకాలు పడిపోవడం ఇదే తొలిసారి. స్మార్ట్‌ఫోన్లలో వాడే మెమరీ, ఇతర విడిభాగాల ధరలు విపరీతంగా పెరగడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో ఫోన్ల ధరలు పెరిగి, వినియోగదారులు కొత్త ఫోన్లు కొనడాన్ని వాయిదా వేసుకుంటున్నారు.ప్రముఖ రీసెర్చ్ సంస్థ కౌంటర్‌పాయింట్ నివేదిక ప్రకారం.. 2025 సెప్టెంబర్ నుంచి ఐ=ూవీ, చీూచీఐ వంటి మెమరీ చిప్‌ల ధరలు దాదాపు నాలుగింతలు పెరిగాయి. ఈ ధరలు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా. ఈ ప్రభావంతో దాదాపు అన్ని కంపెనీలు తమ ఫోన్ల ధరలను పెంచేశాయి. ముఖ్యంగా బడ్జెట్, మధ్యశ్రేణి సెగ్మెంట్లలో అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. రూ.15,000 లోపు సెగ్మెంట్‌లో అమ్మకాలు ఏకంగా 45 శాతం పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**వివో టాప్.. శాంసంగ్ మాత్రమే గ్రోత్**

ఈ త్రైమాసికంలో 18 శాతం మార్కెట్ వాటాతో వివో అగ్రస్థానంలో నిలిచింది. అయితే, ధరల పెరుగుదల కారణంగా ఆ సంస్థకు చెందిన బడ్జెట్ ", ు సిరీస్ ఫోన్ల అమ్మకాలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. 14 శాతం వాటాతో ఒప్పో మూడో స్థానంలో ఉండగా, షావోమీ (పోకోతో కలిపి) 13 శాతంతో నాలుగో స్థానంలో, రియల్‌మీ ఐదో స్థానంలో నిలిచాయి. టాప్-5 బ్రాండ్లలో వృద్ధిని నమోదు చేసిన ఏకైక సంస్థగా శాంసంగ్ నిలిచింది. గెలాక్సీ ూా, ూ సిరీస్ మోడళ్లకు ఉన్న డిమాండ్, ప్రత్యేక ఆఫర్లతో శాంసంగ్ 2 శాతం వృద్ధి సాధించి రెండో స్థానాన్ని దక్కించుకుంది.

**అందరినీ ఆశ్చర్యపరిచిన 'నథింగ్'**

మార్కెట్ మొత్తం ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, లండన్‌కు చెందిన 'నథింగ్' బ్రాండ్ మాత్రం అద్భుతమైన పనితీరు కనబరిచింది. గతేడాదితో పోలిస్తే ఏకంగా 105 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత పది త్రైమాసికాల్లో తొమ్మిది సార్లు భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రాండ్‌గా నిలవడం విశేషం. ఆ సంస్థకు చెందిన ఫోన్ సిరీస్‌కు బలమైన డిమాండ్, కొత్తగా విడుదలైన ఫోన్ (4ఎ) విజయం ఈ వృద్ధికి కారణమయ్యాయి. ఫోన్ (4ఎ) ఫ్లిప్‌కార్ట్‌లో రూ.30,000 పైబడిన సెగ్మెంట్‌లో విడుదలైన మొదటి వారంలోనే టాప్ సెల్లర్‌గా నిలిచింది. తమ బ్రాండ్ ప్రత్యేకమైన డిజైన్, ఆవిష్కరణలు, ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు టైటిల్ స్పాన్సర్‌గా నిలవడం వంటి ప్రచార కార్యక్రమాలు ఈ విజయానికి దోహదపడ్డాయని నథింగ్ సహ-వ్యవస్థాపకుడు అకిస్ ఇవాంజెలిడిస్ తెలిపారు.ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, 2026 మొత్తం మీద స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 13 శాతం క్షీణించే అవకాశం ఉందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐకి పెరుగుతున్న డిమాండ్ కారణంగా మెమరీ కొరత ఏర్పడటం కూడా ఈ పరిస్థితికి ఒక కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## నెలవారీ బడ్జెట్ ప్రిపేర్ చేస్తున్నారా - ఇలా పాటిస్తేనే సక్సెస్ అవుతుందట!

**- జీతం, ఖర్చులకు సరిపడేలా బడ్జెట్ ప్రిపేర్ చేస్తున్నారా - అది పక్కాగా అమలు కావాలంటే ఈ విషయాలు తెలుసుకోవాలి!**



జీవితంలో ఎన్నో విజయాలకు "ఆర్థిక క్రమశిక్షణ" పునాది. ఆదాయం ఎంత వస్తోందన్నదానికంటే.. దానిని ఏ విధంగా ఖర్చు చేస్తున్నామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అందుకే చాలా మంది తమ జీతం, ఖర్చులకు అనుగుణంగా బడ్జెట్ తయారు చేస్తుంటారు. అయితే, చాలా మంది ప్లాన్ కరెక్ట్‌గానే ఉంటుంది, కానీ ఎగ్జిక్యూషన్‌లో మాత్రం ఫెయిల్ అవుతుంటారు. దీనికి కారాణాలేంటో నిపుణులు వివరిస్తున్నారు. బడ్జెట్ వేసుకోవడం అంటే అనవసర ఖర్చులకు అడ్డుకట్ట వేస్తూ, ఫ్యూచర్ కోసం డబ్బును పొదుపు చేసుకోవడమని చెబుతున్నారు. బడ్జెట్ ప్రణాళికను సరిగ్గా అమలు చేస్తున్నవారు ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉన్నట్లు ఒక సర్వేలో తేలిందట. ఈ క్రమంలోనే బడ్జెట్‌ను విజయవంతంగా అమలు చేయడానికి కొన్ని టిప్స్ ఉన్నట్లు చెబుతున్నారు నిపుణులు. అవేంటో ఇప్పుడు చూద్దాం.ఆచరణాత్మకంగా: బడ్జెట్ సక్సెస్ కావాలంటే అది కాగితం మీద మాత్రమే కాకుండా, ఆచరణలో అమలు చేయానికి వీలుగా ఉండటం ముఖ్యం అంటున్నారు నిపుణులు. అంటే అంచనాలు ఎప్పుడూ ప్రస్తుత పరిస్థితులకు దగ్గరగా ఉండాలని సూచిస్తున్నారు. ఉదాహరణకు నలుగురు సభ్యులున్న ఒక కుటుంబానికి నెలకు నిత్యావసర ఖర్చులు రూ.15,000 అవుతుంటే.. దాన్ని ఒక్కసారిగా రూ.5,000కు తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటే, అది సాధ్యం కాదంటున్నారు.అదే ఖర్చును రూ.13వేలకు తగ్గించాలని ప్రయత్నిస్తే, కచ్చితంగా సాధ్యం అవుతుందంటున్నారు. పొదుపు విషయంలోనూ ఇదే పద్ధతి పనికొస్తుందని వివరిస్తున్నారు. ఇల్లు కొనడానికి డౌన్ పేమెంట్, కొత్త కారు కొనుగోలు, విదేశీ ప్రయాణం వంటి అన్ని లక్ష్యాలూ ఒకేసారి సాధించాలనుకోవడం అత్యాశే అవుతుందని.. ఆదాయానికి తగ్గట్టుగా ఏది ముందు, ఏది తరువాత అనే ప్రాధాన్యాలను నిర్ణయించుకొని అడుగులు వేయాలని సూచిస్తున్నారు.బాధ్యతను అప్పగించండి: సంపాదనలో ప్రతి రూపాయికీ ఒక బాధ్యతను అప్పగించాలంటున్నారు. అంటే నెల జీతం రాగానే అద్దె, బిల్లులు, పొదుపు, మదుపు ఇలా అన్నింటికీ పూర్తిగా లెక్కలు రాసి, ఆ ప్రకారమే కేటాయించాలంటున్నారు. నెలాఖరుకు మీ చేతిలో నికర మొత్తం సున్నా అయ్యేలా ముందే ప్రణాళిక వేసుకోవాలని సూచిస్తున్నారు. దీని కోసం ప్రతి ఖర్చునూ నిశితంగా గమనించాలని, జీతం రాగానే ముందుగా దీర్ఘకాలిక లక్ష్యాల కోసం కొంత మొత్తాన్ని పొదుపు ఖాతాలోకి మళ్లించాలంటున్నారు.నేరుగా చెల్లించేయండి: అనుకోని కారణాల వల్ల కొన్నిసార్లు బిల్లులను సకాలంలో చెల్లించలేకపోతాం. దీనివల్ల పెనాల్టీ కట్టడంతోపాటు క్రెడిట్ స్కోరూ దెబ్బతింటుంది. అయితే, ఈ సమస్యకు ఉత్తమ పరిష్కారం.. బిల్లుల చెల్లింపులను, పొదుపును ఆటో-పే లేదా ఆటోమేటిక్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఉంచడం అని సూచిస్తున్నారు. అంటే నెల ప్రారంభంలోనే నిర్దేశిత సొమ్ము పొదుపు ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ అయ్యేలా ఏర్పాటు చేసుకుంటే, ఆ డబ్బును ఇతర వృథా ఖర్చులకు ఉపయోగించే అవకాశం ఉండదని సూచిస్తున్నారు.ముందే ఊహించండి: నార్మల్‌గా నెలవారీ ఖర్చులు మనకు గుర్తుంటాయి. కానీ, సంవత్సరానికి ఒకసారి చెల్లించే బీమా ప్రీమియంలు, పన్నులు, పండగలు లేదా పుట్టిన రోజు గిఫ్ట్‌లు, ఓటీటీ యాన్యువల్ చందాలవంటి వ్యయాలు చాలా మంది బడ్జెట్‌లో చేర్చడం మర్చిపోతుంటారు. దీంతో ఇవి హఠాత్తుగా వచ్చి పడినప్పుడు నెలవారీ బడ్జెట్ తలకిందులవుతుందని. అందుకే, ఇటువంటి ఖర్చులనూ ముందుగానే ఊహించి, బడ్జెట్‌లో వీటిని తగిన ప్రాధాన్యం కల్పించాలంటున్నారు.అనాలోచితంగా వద్దు: చాలా మంది షాపింగ్ మాల్‌కు వెళ్లినప్పుడో లేదా ఆన్‌లైన్ సైట్లను చూస్తున్నప్పుడో అవసరం లేకపోయినా కేవలం ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి, క్షణికావేశంలో వస్తువులను కొనేస్తుంటారు. ఇలాంటి అనాలోచిత ఖర్చులు బడ్జెట్‌ను దెబ్బతీయడమే కాకుండా, తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తాయని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ఒక సర్వేలో అనాలోచిత ఖర్చులు చేసే వారిలో 52 శాతం మంది దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను వాయిదా వేసుకోవాల్సి వస్తోందని, 47 శాతం మంది తీవ్ర ఒత్తిడిని ఎదుర్కుంటున్నామని చెప్పారట.దీన్ని అధిగమించేందుకు "వేచి ఉండే నియమం" పాటించాలంటున్నారు. ఏదైనా వస్తువు కొనాలి అనిపించినప్పుడు కనీసం రెండుమూడు రోజులైనా వెయిట్ చేయాలని, అప్పటికి దాని అవసరం ఎంత ఉందనేది తెలుస్తుందని చెబుతున్నారు. అనుకోని కొనుగోళ్ల కోసం బడ్జెట్‌లో చాలా చిన్న మొత్తం కేటాయించడం మంచిదని వివరిస్తున్నారు.సమీక్షించుకోండి: బడ్జెట్ విషయంలో కేవలం కాగితంపై ప్రణాళికలు రాసుకుంటే సరిపోదని, వాటిని కచ్చితంగా అమలు చేస్తున్నామా లేదా అనేది పర్యవేక్షించుకోవాలంటున్నారు. జీవిత భాగస్వామితో కలిసి బడ్జెట్ విషయాలను చర్చించడం అలవాటు చేసుకోవాని సూచిస్తున్నారు. ఒంటరిగా ఉండేవారు నమ్మకమున్న బంధువులు, కుటుంబ సభ్యుడిని తమ ఆర్థిక పెట్టుబడులకు నామినీగా ఉంచాలని వివరిస్తున్నారు.మార్చుకునేలా ఉండాలి: బడ్జెట్ అనేది శిలా శాసనం కాదని, కాలక్రమేణా మారుతున్న అవసరాలకు అనుగుణంగా దీన్ని సవరించుకుంటూ ఉండాలని వివరిస్తున్నారు. నెలాఖరున బడ్జెట్ అంచనాలను, అసలు ఖర్చులతో పోల్చి చూసుకోవాలని, అనుకున్నదానికంటే ఎక్కువ ఖర్చు అవుతుంటే వచ్చే నెలలో తగిన మార్పులు చేసుకోమంటున్నారు. ఉద్యోగం మారడం, కుటుంబంలో కొత్త సభ్యుల రాక, అనారోగ్యం వంటి పెద్ద జీవిత మార్పులు సంభవించినప్పుడు బడ్జెట్‌ను పూర్తిగా మార్చుకోవడానికి వెనుకాడకూడదని సలహా ఇస్తున్నారు.

## త్వరలో పాలిమర్ నోట్లు విడుదల- 2027 నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభించే అవకాశం!




తొలుత రూ.10, రూ.20 నోట్లు- కొత్త పాలిమర్ నోట్లనూ దశలవారీగా ప్రవేశపెట్టనున్న త్వరలో పాలిమర్ నోట్లను విడుదల చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అధికారిక వర్గాలు తెలిపాయి. కొత్త తరం కరెన్సీని ప్రవేశపెట్టాలన్న కేంద్ర బ్యాంకు ప్రణాళికలో తదుపరి దశగా ఈ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నాయి. వీటిని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రూ.10, రూ.20 నోట్లను తొలుత తీసుకురానున్నారు. వీటి ఫలితం ఆధారంగా, 2027 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసే దిశగా ఆర్‌బీఐ అడుగులు వేస్తోంది. ప్రస్తుత కాగితపు నోట్లు చలామణిలో కొనసాగుతుండగానే కొత్త పాలిమర్ నోట్లనూ దశలవారీగా ప్రవేశపెట్టనున్నారు. పాలిమర్ నోట్లు వచ్చినప్పటికీ, పేపర్ కరెన్సీ ఎప్పటిలానే కొనసాగుతాయని, దశలవారీగా పాలిమర్ నోట్లు మార్కెట్‌లోకి చలామణీకి రానున్నాయని వర్గాలు తెలిపాయి. అయితే, కాగితపు కరెన్సీతో పోలిస్తే ఇవి ఎక్కువ మన్నికగా ఉంటాయి. చలామణిలో ఉన్న కరెన్సీ నాణ్యతను, మన్నికను మెరుగుపరిచే విస్తృత వ్యూహంలో భాగంగా పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలనే తన ఉద్దేశాన్ని ఆర్‌బీఐ గతంలోనే ప్రకటించింది.

**ఈ నోట్లతో ఎక్కువ కాలం మన్నిక**

కరెన్సీ నోట్ల మన్నికను పెంచడం, అలాగే, నకిలీ నోట్లను అరికట్టడం ఈ పాలిమర్ నోట్ల ముఖ్య ఉద్దేశం. అయితే, అధునాతన భద్రతా లక్షణాలతో కూడిన పాలిమర్ సబ్‌స్ట్రేట్‌ను సరఫరా చేయడానికి ప్రపంచవ్యాప్త తయారీదారులను ఆహ్వానించారు. బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ ఆగస్టు 18. ఇక, పాలిమర్ నోట్ల విషయానికొస్తే, ఇవి తడిని తట్టుకోగలవు, అలాగే, చిరిగి పోవడం, నల్లగా మారడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాదు, ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. పలుచని, రక్షిత అల్ట్రా వయొలెట్ క్యూర్డ్ వార్నిష్ పూత పూసిన కాగితపు నోట్లనే వార్నిష్ కరెన్సీగా పిలుస్తారు. తరచూ నోట్లు పాడైపోయి, కొత్తవి ముద్రించేందుకు అవుతున్న ఖర్చు తగ్గించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇప్పటికే, ఆస్ట్రేలియా, కెనడా, యూకే, న్యూజిలాండ్ వంటి దేశాల్లో పాలిమర్ నోట్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు.

**డిజిటల్ చెల్లింపులు వచ్చినప్పటికీ**

డిజిటల్ చెల్లింపులు వచ్చినప్పటికీ, కాగితపు కరెన్సీకి ఉన్న గిరాకీ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ముద్రించాలన్న ఆలోచనను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పదేళ్ల క్రితమే ప్రతిపాదించింది. కాగితపు కరెన్సీని ముద్రించడానికి అయ్యే ఖర్చు, నోట్లు చేతులు మారే క్రమంలో అవి పాడైపోవడం వంటి వాటిని దృష్టిలోఉంచుకొని గతంలో ఆర్‌బీఐ ఆ ప్రతిపాదన చేసింది. కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది.అయితే, దేశవ్యాప్తంగా ట్రయల్ పద్ధతిలో రూ.10 విలువైన ఒక బిలియన్ ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ సమయంలో పార్లమెంట్‌కు కేంద్రం తెలియజేసింది. అందుకు కొచ్చి, మైసూర్, జైపూర్, శిమ్లా నగరాలను ఎంచుకుంది. అయితే సాంకేతిక, కార్యాచరణ సమస్యల కారణంగా ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేకపోయింది. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.ఇక, నకిలీ నోట్ల విషయానికొస్తే, బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ రూ.500 నోట్లు కూడా పెద్ద సంఖ్యలో చలామణిలో ఉన్నట్లు ఆర్‌బీఐ కొద్దిరోజుల క్రితం గుర్తించింది. అంతేకాదు, గతేడాదితో పోలిస్తే ఈ నకిలీల బెడద 20 శాతం పెరిగినట్లు పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,17,722 రూ.500 నోట్లను గుర్తించగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 1,41,907 నోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 30,591 నకిలీ రూ.200 నోట్లను గుర్తించినట్లు ఆర్‌బీఐ పేర్కొంది.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు.. వ్యాపారులపై భారం, వినియోగంపై ప్రభావం

**యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు విధించేందుకు ప్రభుత్వ యోచన**

**ఈ నిర్ణయం వ్యాపారాల నిర్వహణ వ్యయాన్ని పెంచుతుందని నిపుణుల ఆందోళన**

**పెద్ద వ్యాపారులకే నామమాత్రపు రుసుము విధించే అవకాశం**

**చిన్న వ్యాపారులు, వ్యక్తిగత లావాదేవీలకు మినహాయింపు కొనసాగింపు**




డిజిటల్ చెల్లింపుల రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న ప్రతిపాదన ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఒకవేళ ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, వ్యాపార నిర్వహణ వ్యయం పెరిగి, తద్వారా వినియోగదారుల కొనుగోలు శక్తిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, యూపీఐ వ్యవస్థను దీర్ఘకాలికంగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వం ప్రాథమికంగా పెద్ద వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఈ రుసుములను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా ఏడాదికి రూ. 1 కోటి నుంచి రూ. 1.5 కోట్లు పైచిలుకు టర్నోవర్ ఉన్న వ్యాపారులపై 0.05 శాతం నుంచి 0.07 శాతం వరకు నామమాత్రపు ఎండీఆర్ విధించే అవకాశాలను పరిశీలిస్తోంది. కాగా, చిన్న వ్యాపారులు, కిరాణా దుకాణాలు మరియు వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలకు మాత్రం ప్రస్తుతమున్న మినహాయింపును కొనసాగించే అవకాశం ఉంది.2020 జనవరి నుంచి యూపీఐ లావాదేవీలపై జీరో-ఎండీఆర్ విధానం కొనసాగుతోంది. దీనివల్ల డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగినప్పటికీ, బ్యాంకులు మరియు పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లపై ఆర్థిక భారం అధికమైంది. ప్రభుత్వం ఏటా సుమారు రూ. 2,000 కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తున్నప్పటికీ, ఇవి పరిశ్రమ మొత్తం నిర్వహణ ఖర్చులలో కేవలం 11 శాతాన్ని మాత్రమే భర్తీ చేస్తున్నాయని అంచనా. ఈ నేపథ్యంలో, యూపీఐ వ్యవస్థ మనుగడ సాగించాలంటే నామమాత్రపు రుసుము అనివార్యమని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు అభిప్రాయపడుతున్నాయి.ఒకవేళ కొత్తగా ఛార్జీలు విధిస్తే, వ్యాపారులు ఆ భారాన్ని వస్తువుల ధరలు పెంపు లేదా రాయితీల తగ్గింపు ద్వారా వినియోగదారులపైకి మళ్లించే ప్రమాదం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది పరోక్షంగా వినియోగంపై ప్రభావం చూపవచ్చని వారు భావిస్తున్నారు. ఎండీఆర్ ప్రభావం పరోక్షంగా చిన్న వ్యాపారాలపై కూడా పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఏదేమైనా, డిజిటల్ చెల్లింపుల వృద్ధికి విఘాతం కలగకుండా, వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేలా ప్రభుత్వం సమతుల్యమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కొత్త పథకం" - బ్యాంకుల వల్ల నష్టపోతే రూ.33 లక్షల వరకు పరిహారం!

**ఖాతాదారుల రక్షణ కోసం సరికొత్త అడుగు - ఎలాంటి రుసుము లేకుండానే అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయొచ్చు!**




కొన్నిసార్లు ఆర్థిక లావాదేవీల విషయంలో బ్యాంకుల నుంచి సమస్య ఎదురవుతుంటుంది. అంటే, బ్యాంకు సేవల జాప్యం వల్ల మీ డబ్బులు నిలిచిపోవడం లేదా నష్టపోవడం వంటివి జరుగుతుంటాయి. అలాంటి టైమ్‌లో మీ సమస్య గురించి సంబంధిత బ్యాంకుకు కంప్లైంట్ చేసినా వారు స్పందించట్లేదా అలాంటి వారికోసమే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(=దీ×) ఒక కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా ఎలాంటి రుసుము లేకుండానే ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాదు, రూ.33 లక్షల వరకూ పరిహారం కూడా పొందే అవకాశం ఉంది. మరి, ఇంతకీ ఆర్‌బీఐ అందుబాటులోకి తీసుకొచ్చిన ఆ స్కీమ్ ఏంటి ఎలా ఫిర్యాదు చేయాలి వంటి పూర్తి వివరాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.బ్యాంకులు, ఆర్థిక సంస్థల సేవల లోపాలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు త్వరితగతిన న్యాయం చేసేందుకు సరికొత్త అడుగు వేసింది ఆర్‌బీఐ. ఖాతాదారుల ప్రయోజనాల రక్షణ కోసం "నూతన రిజర్వ్ బ్యాంక్ ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ పథకం(ఆర్‌బీఐ-ఐఓఎస్)- 2026" అనే ఒక పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల సేవల్లో లోపాల వల్ల ఇబ్బంది పడే కస్టమర్లు దీని ద్వారా ఎటువంటి ఖర్చు లేకుండా, వేగంగా, ఈజీగా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఈ నూతన పథకం ద్వారా లభించే నష్టపరిహారానికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, అంబుడ్స్‌మన్ వద్దకు తీసుకెళ్లే వివాదాల విలువపై ఎలాంటి లిమిట్ లేదు. ఖాతాదారులు సేవా లోపాల కారణంగా ఆర్థికంగా నష్టపోతే, అందుకు గాను రూ.30 లక్షల వరకూ పరిహారం పొందే ఛాన్స్ ఉంటుంది. దీనితో పాటు ఫిర్యాదుదారుడి విలువైన టైమ్ వృథా కావడం, అనుభవించిన మానసిక క్షోభ, ఇతర ఇబ్బందులకుగాను అదనంగా మరో రూ.3 లక్షల వరకూ పరిహారం లభిస్తుందని ఆర్‌బీఐ రూల్స్ చెబుతున్నాయి. అంటే, మొత్తంగా ఈ పథకం కింద గరిష్ఠంగా రూ.33 లక్షల వరకూ ఖాతాదారులు పరిహారం పొందే వీలు ఉంది.

## రిటైర్మెంట్ తర్వాత హ్యాపీ లైఫ్ కావాలా - నిధిని ఇలా కాపాడుకోవాలని నిపుణుల సూచన!

**- పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు రాకూడదంటే - డబ్బులు ఈ జాగ్రత్తగా చేసుకోవాలంటున్న నిపుణులు!**



సంవత్సరాలపాటు ఉద్యోగ బాధ్యతల్లో నిమగ్నమైన వారు పదవీ విరమణ తర్వాత లైఫ్‌ను హాయిగా గడపాలనుకుంటారు. అయితే, రిటైర్మెంట్ తర్వాత సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన జీవితాన్ని గడపడంలో ఆర్థిక భద్రత కీలక పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే, ఉద్యోగంలో ఉన్నప్పుడు ప్రతినెలా జీతం వస్తుంది. కానీ, రిటైర్మెంట్ తర్వాత నెలవారీ ఆదాయం ఉండదు. దీంతో రోజూవారీ ఖర్చుల కోసం పొదుపులు, ఇతర పెట్టుబడులపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే చాలా మంది పదవీ విరమణ తర్వాత చేతికందిన డబ్బు ఖర్చవుతుందని ఆందోళన చెందుతుంటారు.అయితే జాగ్రత్తగా ప్రణాళిక వేసుకోవడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ఈ పరిస్థితిని నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, పదవీ విరమణ తర్వాత మరికొన్ని సంవత్సరాల జీవితం ఉంటుందని, ఆ సమయంలో జీవన వ్యయాలు, సంరక్షణ ఖర్చులు, ఊహించని అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి తగినంత నిధులు కలిగి ఉండడం ముఖ్యమంటున్నారు. ఈ నేపథ్యంలోనే పదవీ విరమణ నిధి త్వరగా అయిపోకుండా కొన్ని టిప్స్ పాటించాలని సూచిస్తున్నారు. అవేంటో ఇక్కడ చూద్దాం.బడ్జెట్: ఆర్థికంగా సురక్షితమైన పదవీ విరమణకు నెలవారీ బడ్జెట్ ప్రణాళిక ప్రధాన దశ అని నిపుణులు వివరిస్తున్నారు. ఎంత ఆదా చేయగలరో అర్థం చేసుకోవడానికి ఆదాయం, ఖర్చులను గమనిస్తూ ఉండడం చాలా అవసరమంటున్నారు. ప్రస్తుత లైఫ్‌స్టైల్‌ను పరిశీలించి, రిటైర్మెంట్ తర్వాత ఖర్చులు ఎలా ఉంటాయో అంచనా వేయాలని సూచిస్తున్నారు. అంటే రోజువారీ అవసరాలు, వైద్య ఖర్చులు, ప్రయాణాలు వంటి ముఖ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, దానికి అనుగుణంగా ఖర్చులు ప్రణాళిక వేసుకోవాలని సూచిస్తున్నారు. సగటు నెలవారీ ఖర్చులు, ద్రవ్యోల్బణం వంటి విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని, దీనివల్ల రిటైర్మెంట్ తర్వాత సౌకర్యవంతంగా జీవించడానికి ఎంత ఉంటే సరిపోతుందో ఒక అంచనా తెలుస్తుందని అంటున్నారు.రిటైర్మెంట్ నిధి ఎంతో అర్థమైన తర్వాత, నెలవారీ బడ్జెట్‌ను ఏర్పాటు చేసుకొని దానికి కట్టుబడి ఉండడానికి ప్రయత్నించాలని సూచిస్తున్నారు. ఈ సమయంలో వైద్య ఖర్చులు ఒక ముఖ్యమైన భారం కావచ్చని, అందువల్ల సమగ్రమైన ఆరోగ్య బీమా పథకం ఈ ఖర్చులను భరించడంలో, పదవీ విరమణ పొదుపును కాపాడుకోవడంలో సహాయపడుతుందని వివరిస్తున్నారు.ఖర్చులకు ఈ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని, అయితే, ఈ నిధిని ఉపయోగించిన తర్వాత వీలైనంత త్వరగా తిరిగి భర్తీ



## 72వ జాతీయ చలన చిత్ర పురస్కారాలు..
# ఉత్తమ తెలుగు చిత్రంగా కమిటీ కుర్రోళ్లు

కేంద్రం 72వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను ప్రకటించింది. 2024 సంవత్సరానికిగాను కేంద్రం ఈ పురస్కారాలను ప్రకటించింది. ఉత్తమ తెలుగు సినిమాగా 'కమిటీ కుర్రోళ్లు' నిలిచింది. ఉత్తమ తమిళ సినిమాగా 'రాయన్' నిలువగా.. ఉత్తమ మలయాళ చిత్రం- ఫెమినిస్ట్ ఫాతిమా, ఉత్తమ హిందీ చిత్రం శ్రీకాంత్. ఉత్తమ కన్నడ చిత్రం మిథ్య అవార్డులు గెలుచుకున్నాయి. తెలుగు సినిమాలకు 9 జాతీయ అవార్డులు దక్కాయి.

తెలుగు సినిమాలు గెలుచుకున్న అవార్డులు..

ఉత్తమ తెలుగు చిత్రం-'కమిటీ కుర్రోళ్లు'

బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్-పీ. రవికుమార్ (కమిటీ కుర్రోళ్లు)

ఉత్తమ సంగీత దర్శకుడు- జీవీ ప్రకాశ్ కుమార్ (అమరన్) ,

ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్స్ దీపాలి నూర్, శీతల్ శర్మ (పుష్ప 2),

ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్- సుకుమార్ (పుష్ప 2),

ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్-జతిన్ జానీ చౌద (కల్కి),

ఉత్తమ స్క్రీన్ ప్లే, డైలాగ్ రైటర్ -- వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్),

బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్- పోతుల అరుణ్ దేవ్ (35 మార్కులు చిన్న కథ కాదు)

ఉత్తమ బాలల చిత్రం- (35 చిన్న కథ కాదు)

# పెద్ది తర్వాత కొత్త సినిమాకు జాన్వీకపూర్ గ్రీన్ సిగ్నల్.. !




దేవర సినిమాతో టాలీవుడ్‌కు గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది బాలీవుడ్ భామ జాన్వీకపూర్. ఈ చిత్రం జాన్వీకపూర్ కు ఆశించిన స్థాయిలో బ్రేక్ ఇవ్వలేకపోయింది. రీసెంట్‌గా రాంచరణ్‌తో కలిసి నటించిన పెద్ది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అయితే ఈ మూవీ కూడా జాన్వీకపూర్‌కు అంతగా కలిసి రాలేదు. పెద్దిలో జాన్వీకపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. భవిష్యత్‌లో ఇలాంటి పాత్రలు చేయొద్దంటూ పలువురు నెటిజన్లు జాన్వీకపూర్‌కు సూచించారు. అయితే జాన్వీకపూర్ నెక్ట్స్ ఎలాంటి ప్రాజెక్టు చేయబోతుందా..? అని ఆసక్తిగా చర్చించుకుంటున్నఅభిమానులు, మూవీ లవర్స్ కోసం క్రేజీ న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది. ౹ాఖుస్త్రస్త్రశ్రీఖఊ ఫేం ఉమేశ్ బిస్ట్ డైరెక్టర్‌తో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది జాన్వీకపూర్. బాలాజీ మోషన్ పిక్చర్స్, సిఖ్య ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఏక్తాకపూర్, గునీత్ మోంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ వచ్చే అక్టోబర్-నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. వెబ్ షోలను డైరెక్ట్ చేశాడు. మరి ఉమేశ్ బిస్ట్ జాన్వీకపూర్ కోసం ఎలాంటి పాత్రను డిజైన్ చేశాడు. ఈ సినిమాతో అయినా జాన్వీకపూర్‌కు బ్రేక్ వస్తుందా..? అనేది తెలియాల్సి ఉంది.



### రాంచరణ్ ఫ్యాన్స్‌కు అదిరిపోయే న్యూస్.. సుకుమార్ 'ఆర్‌సీ 17' లాంచింగ్ టైం ఫిక్స్..!

ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్నాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ఈ గ్లోబల్ స్టార్ సుకుమార్‌తో చేసిన రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17 సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.వీశీజఊఅవం ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు. మరి దీనిపై రాంచరణ్-సుకుమార్ టీం నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.




# పొలిమేర 3లో యాక్షన్ కింగ్ అర్జున్?




టాలీవుడ్‌లో సూపర్ క్రేజ్ సంపాదించిన పాపులర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీల్లో టాప్‌లో ఉంటుంది మా ఊరి పొలిమేర. సత్యం రాజేశ్ కామాక్షి భాస్కర్ల, బాలాదిత్య లీడ్ రోల్స్‌లో నటించిన ఫస్ట్ పార్ట్ కోవిడ్ టైంలో డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఎంట్రీ ఇచ్చి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఆ తర్వాత సీక్వెల్ మా ఊరి పొలిమేర 2 థియేటర్లలో విడుదలైన బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. డాక్టర్ అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ఈ ఫ్రాంచైజీలో మూడో పార్టు పొలిమేర 3 కూడా అధికారికంగా ప్రకటించారని తెలిసిందే. పొలిమేర 3కు సంబంధించిన ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇందులో తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న యాక్షన్ కింగ్ అర్జున్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే అర్జున్‌ను డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్ ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది సస్పెన్స్ క్రియేట్ చేస్తూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తోంది. ఇప్పటికే పొలిమేర 3అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నారు మేకర్స్. పొలిమేర 2ను పంపిణీ చేసిన వంశీ నందిపాటి భోగేంద్ర గుప్తాతో కలిసి పొలిమేర 3 నిర్మిస్తున్నారు. భోగేంద్ర గుప్తా ఫస్ట్ పార్టుకు నిర్మాతగా వ్యవహరించగా.. పొలిమేర 3కి భోగేంద్ర గుప్తా సహ నిర్మాతగా వ్యహరిస్తున్నారు. ఈ చిత్రంలో గెటప్ శీను, రాకేందు మౌళి, సాహిత్య దాసరి, రవివర్మ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే ఫస్ట్ పార్టు, సెకండ్ పార్టు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచాయి. మరి ఇదే జోనర్‌లో కొనసాగింపుగా వస్తోన్న త్రీక్వెల్ ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందనేది చూడాలి.

### కెమికల్ కాదది విషం.. భయపెట్టేలా ట్రైలర్



ఒకప్పటితో పోలిస్తే మనం తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి ప్రతిదీ కల్తీ అయిపోయింది. కాదు కాదు కొందరు వ్యాపారాలు చేసేస్తున్నారు. దీని వల్ల యువతరం, చిన్న పిల్లలు.. క్యాన్సర్ లాంటి ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారు. ఈ సంగతులన్నీ జనాలకు తెలుసు. రోజూ పేపర్, టీవీ, సోషల్ మీడియాలో చూస్తూనే ఉంటారు. అలాంటి కాన్సెప్ట్‌తో తీసిన సినిమా 'ద ఇండియా స్టోరీ'. కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రలు పోషించారు. వచ్చే శుక్రవారం(జూలై 24) మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. దేశ సరిహద్దుల్లో సైనికుడిగా పనిచేసిన ఓ వ్యక్తి ఏడేళ్ల కూతురు క్యాన్సర్‌తో చనిపోతుంది. అయితే తన కుమార్తెని అన్యాయంగా చంపేశారని చెప్పి సదరు తండ్రి.. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడు. ఓ లాయర్‌తో కలిసి క్రిమి సంహారకాలు తయారు చేసే కంపెనీలు, కల్తీ చేసే సంస్థలపై పోరాటానికి దిగుతాడు. ఈ ప్రయాణంలో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నాడు? ఓ మహిళా లాయర్‌తో కలిసి ఏం చేశాడు? రైతులు వీళ్లిద్దరిపై ఎందుకు తిరగబడ్డారు? అనేదే స్టోరీలా అనిపిస్తుంది. ట్రైలర్ అయితే బాగానే ఉంది. ఇందులో చూపించినవన్నీ చేదు నిజాలే. జనాలకు కూడా ఇలాంటి కల్తీ, క్రిమి సంహారక మందుల గురించి తెలుసు. అయినా సరే వేరే ఆప్షన్ లేకపోవడంతో ఇవి తింటున్న పరిస్థితి. ఇవి కాకుండా మూవీలో ఇంకేం చూపిస్తారో చూడాలి? ఈ మూవీ హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ రిలీజ్ కానుంది. ప్రస్తుతానికైతే ఈ చిత్రంపై ఏ మాత్రం బజ్ లేదు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com